# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

16.12.2025 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 166 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









## ఐసిస్‌తో సంబంధాలు

■ ఇద్దరు ఉగ్రవాదుల అరెస్ట్

ముంబైలో ఇద్దరు ఉగ్రవాదులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాజన్, మనీష్ బేడీ అనే ఇద్దరు టెర్రరిస్టులు పాకిస్థాన్‌లోని ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు.

03

## కోఠి ఉమెన్స్ కాలేజీలో లైంగిక వేధింపులు

- వెలుగులోకి ఫోన్ కాల్ రికార్డ్!
- మెస్‌ఇన్‌చార్జిపై షీటీమ్‌కు ఫిర్యాదు
- ఆరోపణలపై విచారణ కమిటీ
- చర్యలు తీసుకోవాలి: రాజాసింగ్

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక కోఠి ఉమెన్స్ కాలేజీలో లైంగిక వేధింపుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి.

03





## కామారెడ్డి జిల్లాలో దారుణం

- గెలిచిన సర్పంచ్ తమ్ముడి దాష్టీకం
- ఓడిన అభ్యర్థి తదితరులపై ట్రాక్టర్‌తో దాడి
- దాడిలో పలువురికి తీవ్ర గాయాలు..

03

# తుది పోరుకు రెడీ




- 3,752 పంచాయతీల్లో ఎన్నికలకు ఏర్పాట్లు
- ముగిసిన మూడో విడత ఎన్నికల ప్రచారం
- 17న పోలింగ్... మూడ్రోజులపాటు మద్యం బంద్ మిగతా 3 లో
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్

"రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం సాయంత్రంతో ప్రచారం ముగియగా, బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎన్నికలు డిసెంబర్ 17న జరగనున్నాయి."

**హైదరాబాద్, డిసెంబర్15:** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత ప్రచారం సోమవార సాయంత్రంతో గడువు ముగిసింది. ప్రచార డప్పులు మోగడం ఆగిపోవడంతో, ఇప్పుడు అభ్యర్థులు, కార్యకర్తలు పోలింగ్ రోజు కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 17 (రేపు) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మూడో విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనున్నది. ఈ విడతలో మొత్తం 182 మండలాల్లోని 3,752 పంచాయతీలు

మిగతా 3 లో



## గ్రామీణ ఉపాధి చట్టం రద్దుకు యత్నం?

■ దాని స్థానే కొత్త బిల్లుకు రూపకల్పన

04

## కాంగ్రెస్ గూండాగిరి



సోమార్‌పేట్ గ్రామ ఘటనపై కేటీఆర్ ఆగ్రహం

చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు

02

## వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు




- భారీగా వినతులు అందజేస్తున్న నేతలు
- ప్రధానంగా ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యేల అభ్యంతరం

03

## బీజేపీకి ఘోర పరాభవం

- 3911 స్థానాల్లో గెలిచింది 6.5 శాతం
- కేవలం 236 స్థానాల్లోనే విజయం
- రెండు, మూడు జిల్లాల్లోనే ప్రభావం

02



## రిజర్వేషన్ల పరిమితి ఎత్తేయాలి



02

- ఎవరి వాట వారికి దక్కేవరకు పోరాటాన్ని ఆపేదీలేదు
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం నాన్చుడెంది
- బీసీలను అణిచివేయాలని చూస్తే దేశంలో తిరుగుబాటు తప్పదు
- బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి ప్రధాని బీసీలపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- ఢిల్లీ బీసీ ధర్నాలో అఖిలపక్ష నేతల వెల్లడి

## బాలు అందరివాడు



- ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహ ఆవిష్కరణలో వెంకయ్య నాయుడు

02



04

## బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్

## జోర్డాన్‌లో ప్రధాని మోడీకి ఘన స్వాగతం

■ భారత సంతతి ప్రజల ఆనందం

భారతీయ సంతతి భారత్-జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హోటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు.



04



# బాలు అందరివాడు

**మన తెలుగువాడు కావడం గర్వకారణం**

**స్వరసరస్వతిని స్మరించుకోవడం అదృష్టం**

**బాలు విగ్రహావిష్కరణలో వెంకయ్యనాయుడు**

**హైదరాబాద్, డిసెంబర్ 15:** ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకమని, బాలును అభిమానింగా గౌరవించుకోవడం తెలుగువారిగా మనకంతా గర్వకారణమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతి లో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాల సుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. తన తండ్రి, ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం రాజకీయాలకు అతీతంగా ఉండేవారని ఎస్పీ చరణ్ గుర్తుచేసుకున్నారు. ఆయనకు అందరూ ఒకటే అని పేర్కొన్నారు. రవీంద్ర భారతి ఆవరణలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చరణ్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, తెలుగు ప్రజలు, బాలు విగ్రహం ఏర్పాటుకు నాలుగేళ్లుగా కృషి చేసిన బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి అందరితో ఎంత స్నేహపూర్వకంగా ఉండేవారన్న దానికి ఈ కార్యక్రమం ఓ నిదర్శనమన్నారు.మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

# ఉపాధిహామీని దెబ్బతీసే కుట్ర

**పేదలను, రాష్ట్రాలను వంచిస్తున్న కేంద్రం**

**కొత్త చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలి: సీతక్క**



**హైదరాబాద్, డిసెంబర్15:** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. పథకం పేరునే కాకుండా దాని ఆత్మను, అమలు విధానాన్ని మార్చేలా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలన్న మహాత్మాగాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలను ఆమె తప్పుబట్టారు. కేంద్ర విధానం పేదలను, రాష్ట్రాలను శిక్షించే విధంగా ఉందని ఆక్షేపించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును ' వికసిత్ భారత్– గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్' గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లును ఆమె తప్పుబట్టారు. గతంలో వంద శాతం నిధులు వెచ్చించి.. పథకాన్ని అమలు చేసిన కేంద్రం ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40 శాతం భారాన్ని రాష్ట్రాలపై మోపడం అన్యాయమని మంత్రి సీతక్క అన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమర్శించారు. పథకం పేరు నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా గాంధీజీ ఆలోచనలు, విలువల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వ్యతిరేక వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని సీతక్క ఆరోపించారు. మొదటి నుంచే ఈ పథకం నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ఇష్టం లేదని, అందుకే దశలవారీగా బలహీనపరిచే కుట్రలకు తెరలేపుతోందని విమర్శించారు.

# ఎన్నికల అధికారిపై ఆగ్రహం

**గదిలో బంధించడంతో పోలీసుల జోక్యం**

**సూర్యాపేట, డిసెంబర్ 15:** ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల హడవుడి నడుస్తుంది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం.. సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజును గ్రామస్థులు ఓ గదిలో బంధించారు. ఎన్నికల అధికారి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని.. ఉపసర్పంచ్ పదవిని ముందుగానే ప్రకటించారని గ్రామస్థులు ఆరోపిస్తునున్నారు. నాగరాజు వ్యవహారంపై గ్రాస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని గదిలో బంధించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయమై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటే.. ఓడిన అభ్యర్థులు కొన్నిచోట్ల ఆందోళన చేస్తున్నారు. తమ వద్ద డబ్బు తీసుకొని వేరే వాళ్లను గెలిపించారని ఆరోపిస్తూ.. తిరిగి డబ్బు చెల్లించాల్సిందిగా ఓటర్లను ఒత్తిడి చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడుతున్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాగిరి

- సోమార్‌పేట్ గ్రామ ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదు



**హైదరాబాద్, డిసెంబర్ 15:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, ఆ పార్టీ నాయకుల గూండాగిరి రోజురోజుకూ శృతి మించుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగిన అమానుష ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు తెగబడటం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న వెంటనే కేటీఆర్, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు ఫోన్ చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. పార్టీ వారికి అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. అనంతరం కామారెడ్డి జిల్లా ఎస్పీకి కేటీఆర్ స్వయంగా ఫోన్ చేశారు. సోమార్‌పేట్ ఘటనను వివరించి, బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారం ఉంది కదా అని కాంగ్రెస్ నేతలు హత్యాయత్నాలకు పాల్పడుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని, ప్రజలు, కార్యకర్తలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని కేటీఆర్ హెచ్చరించారు.

## పంచాయతీ ఎన్నికలతో కాంగ్రెస్ పతనం

**హైదరాబాద్, డిసెంబరు 15:** రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తా చాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని ప్లలె ప్రజలు తమ ఓటు ద్వారా మ–రోసారి తేల్చిచెప్పారని అన్నారు. రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్ కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయని కేటీఆర్ తెలిపారు. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసానిచ్చారు. నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం అన్నారు. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేయాల్సిందే

- ఎవరి వాట వారికి దక్కేవరకు పోరాటాన్ని ఆపేదిలేదు
- 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం నాన్చుడేంది
- బీసీలను అణిచివేయాలని చూస్తే దేశంలో తిరుగుబాటు తప్పదు
- బీసీ బిల్లుకు ఆమోదం తెలిపి ప్రధాని బీసీలపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి
- డిల్లీ బీసీ ధర్నాలో అఖిలపక్ష నేతల వెల్లడి



**న్యూ ఢిల్లీ, డిసెంబర్ 15:** దేశంలో పై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసి జనాభా దమాష ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని లేనిపక్షంలో దేశంలో సామాజిక తిరుగుబాటు తప్పదని అఖిలపక్ష పార్టీల నేతలు బిసి సంఘాలు జేఏసీ నేతలు హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఇచ్చిన చలో ఢిల్లీ పిలుపుమేరకు నేడు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీసీల మహాధర్నా నిర్వహించారు. ఈ మహా ధర్నాకు టీపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ టిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి,మాజీ పార్లమెంట్ సభ్యులు వి హనుమంతరావు, రాపోలు ఆనంద భాస్కర్, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కుంతియా, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు, మహారాష్ట్ర అధ్యక్షులు సచిన్ రాజోలుకర్ హాజరయ్యారు. బీసీ రిజర్వేషన్ల పెంపు పై కాంగ్రెస్ వెనుకడుగు వేయదనీ, స్థానిక పరిస్థితుల దృశ్య గ్రామ పంచాయతీల ఎన్నికలు నిర్వహించామే తప్ప, బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ వైదొలగలేదని, రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే తో ఇప్పటికే చర్చించామని అతి త్వరలోనే కేంద్రంపై పోరాడడానికి తమ రాజకీయ కార్యచరణ ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా బిజెపి అడుగడుగునా అడ్డుపడుతుందని రాజ్యాంగబద్ధ సంస్థలను తమ చేతిలో పెట్టుకుని బిసి రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్రలు చేస్తుందని ఆయన ఆరోపించారు తెలంగాణ నుండి ఎన్నికైన ఎనిమిది మంది బిజెపి ఎంపీలు రాజీనామా చేస్తే కేంద్రం దెబ్బకు దిగి వస్తుందని ఆయన అన్నారు. వి శ్రీనివాస్ గౌడ్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర లు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ నుండి కాంగ్రెస్ పార్టీ రాజకీయ గ్రామాలు ఆడుతుందని, రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టిన, చట్టం చేసిన బిఆర్ఎస్ పార్టీ అండగా నిలబడిందని, కానీ కాంగ్రెస్ చిత్తశుద్ధితో ప్రయత్నించకుండా వ్యహరిస్తుందని వారు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వచ్చి ప్రధాని కలవాలని డిమాండ్ చేసి కలవడం లేదని, కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి నేతలు పార్లమెంటులో కనీసం మాట్లాడడం లేదని, అనేక బిల్లులను కాంగ్రెస్ బిజెపి లో కలిసి పార్లమెంటులో ఆమోదించుకున్న సందర్భాలు అనేకమైనప్పటికీ బీసీ బిల్లు విషయంలో మాత్రం రెండు పార్టీలు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని వారు తీవ్రంగా విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీల చిత్తశుద్ధి ఎండగట్టడానికి పార్లమెంటులో ప్రవేట్ బిల్లును ప్రవేశపెట్టామని, కాంగ్రెస్ బిజెపిలకు చిత్తశుద్ధి ఉంటే టిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రైవేటు బిల్లుకు మద్దతు తెలపాలని వారు డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ బిసి బిల్లు పై పార్లమెంట్లో కొట్లాడుతున్న బిజెపి స్పందించడం లేదని ఈ దారుణం అన్నారు కాగా మల్లురవి మాట్లాడుతుండగా బిసి సంఘాల నేతలు అఖిలపక్షంతో సీఎం ఢిల్లీకి ఎందుకు రావడం లేదని పార్లమెంటులో రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడడం లేద నీ ఆయన ఉపన్యాసానికి అడ్డు తగిలారు. ఈ మహా ధర్నాకు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ సమన్వయం చేయగా బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, మహిళా సంఘం అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, పెరిక సురేష్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, కే వీరస్వామి, పిట్ల శ్రీధర్, కౌల జగన్నాథం, నాగ మల్లేశ్వరరావు, నందగోపాల్, జాజుల లింగం గౌడ్, వేముల రామకృష్ణ, మడత వెంకట్ గౌడ్, గూడూరు భాస్కర్, స్వర్ణ, గౌతమి, ఉదయనేత, శివమ్మ, శివకుమార్, సుమన్ , బిక్షం గౌడ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


# బీజేపీకి ఘోర పరాభవం

**3911 స్థానాల్లో గెలిచింది 6.5 శాతం**

**కేవలం 236 స్థానాల్లోనే విజయం**

**రెండు, మూడు జిల్లాల్లోనే ప్రభావం**

**హైదరాబాద్, డిసెంబరు 15:** తెలంగాణ పంచాయతీ పోరులో కమలం వాడిపోయింది. తెలంగాణలో 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీలు ఉన్న బీజేపీ పల్లెల్లో మాత్రం పట్టుకోల్పోయింది. గ్రామ పంచాయతీలకు జరిగిన రెండు విడతల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలిచిన సీట్లలో కనీసం సగం కూడా సాధించలేక ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్నది. తొలి విడతలో దారుణంగా ఓటమిపాలైన బీజేపీ కేవలం 189 పంచాయతీల్లో గెలుపొందింది. రెండో విడతలోనూ గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికలు జరిగిన 3,911 స్థానాల్లో కేవలం 236 స్థానాల్లో (6.5 శాతం) మాత్రమే బీజేపీ మద్దతుదారులు విజయం సాధించగలిగారు.ఆదిలాబాద్, మంచిర్యాల మినహా మిగిలిన ఏ జిల్లాలోనూ బీజేపీ కనీసం పోటీ కూడా ఇవ్వలేకపోయింది. రెండు విడతల్లో ఆ పార్టీ కేవలం 435 స్థానాలతో సరిపెట్టుకున్నది. రెండు విడతల్లో స్వతంత్ర అభ్యర్థులు 1,161 స్థానాల్లో గెలుపొందారు. అందులో సగం కూడా బిజెపి కి రాకపోవడం కమలనాథుల దయనీయస్థితికి అద్దంపడుతున్నది. కేంద్ర మంత్రి బండి సంజయ్ నియోజకవర్గమైన కరీంనగర్‌తోపాటు ఎంపీ ఈటల గతంలో ప్రాతినిథ్యం వహించిన హుజూరాబాద్ లోనూ బీజేపీ మద్దతుదారులు ఓటమిపాలవడం చర్చనీయాంశమైంది. మరో ఎంపీ రఘునందన్‌రావు ప్రాతినిథ్యం



వహిస్తున్న మెదక్‌లో కనీసపోటీ ఇవ్వక పోవడంతో బీజేపీ ఉనికి ప్రశ్నార్థకమైంది. బీఆర్ఎస్ పని అయిపోయిందని, ప్రత్యామ్నాయం తామేనని ఊదరగొట్టే బీజేపీ రాష్ట్ర నేతల మాటలు కేవలం వట్టివేనని రెండు విడతల పంచాయతీ ఎన్నికల ఫలితాలతో ఖరారయిపోయింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి కనీసం డిపాజిట్ దక్కలేదు. మున్ముందు తెలంగాణలో ఆ పార్టీ ప్రభావం నామమాత్రమేనని పేర్కొంటున్నారు.

# తుది విడత పంచాయతీ పోరుకు రెడీ

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల రంగంలోకి దిగుతున్నాయి. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో 3,752 గ్రామ పంచాయతీలకు, 28,406 వార్డులకు 75,283 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ విడతలో 4,157 గ్రామాలకు, 36,434 వార్డులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. 394 గ్రామాలు,7916 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 3,752 గ్రామ పంచాయతీల్లో 12,640 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ పడుతున్నారు. కాగా, 11 గ్రామాలకు,112 వార్డులకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడం లేదు.



### ముగిసిన మూడోదశ పోలింగ్ ప్రచారం

రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. సోమవారం సాయంత్రంతో ప్రచారం ముగియగా, బుధవారం ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎన్నికలు డిసెంబర్ 17న జరగనున్నాయి. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం సోమవారం ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఎన్నికలు జరుగనున్న గ్రామాల్లో సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. 2గంటల నుంచి కౌంటింగ్ జరిగిప ఫలితాలు ప్రకటిస్తారు. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామా, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి. మూడో విడతలో మొత్తం 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే.. ఇప్పటి వరకు జరిగిన రెండు విడతల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. రెండో స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయాలు సాధిస్తుండగా.. మూడో స్థానంలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతున్నారు. అంతేకాకుండా.. కొన్ని కొన్ని చోట్ల ఓట్లు సమంగా రావడంతో అభ్యర్థులు చివరకు టాస్ తో విజయం సాధిస్తున్నారు.

### మద్యం దుకాణాలు బంద్..

ఎన్నికల నిబంధనల ప్రకారం, సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి రేపు సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులకు బంద్ అమల్లోకి వచ్చింది. ఇక తుది విడత పోరుకు అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది సిద్దమయ్యారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో ఇప్పటికే పోలింగ్ సామగ్రి చేరుకుంది. 16న ఉదయం 7 గంటల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద నుంచి సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని పోలీస్ బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్నారు.

## చెదిరిన సర్పంచ్ కల

### వీఆర్ఎస్ తీసుకున్న ఎస్ఐకి ఓటమి



**కోదాడ, డిసెంబర్ 15:** ఐదు నెలల సర్వీస్ మిగిలి ఉండగానే స్వచ్ఛంద పదవీ విరమణ చేసి సర్పంచ్‌గా పోటీ చేసిన ఎస్ఐ ఓడిపోయారు. తన సర్పంచ్ కలను నెరవేర్చుకోలేక పోయారు. ఈ ఘటన కోదాడ మండలంలో వెలుగుచూసింది. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటేశ్వర్లు ఓటమి పాలయ్యారు. రెండవ విడత ఎన్నికల్లో ఆయన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన గుడిబండ గ్రామంలో ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి.. రేషన్ డీలర్ అయిన నాగయ్య చేతిలో 10 ఓట్ల తేడాతో వెంకటేశ్వర్లు ఓడిపోవడం గమనార్హం. పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సూర్యాపేట జిల్లా కోదాడ ఎస్సై పోస్ట్ నుంచి వెంకటేశ్వర్లు వీఆర్ఎస్ తీసుకున్నారు. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు కోదాడ టౌన్ లో ఎస్సైగా పని చేసేవారు. కానిస్టేబుల్‌గా పోలీస్ శాఖలో చేరిన ఆయన కష్టపడి పైకొచ్చారు. ఎస్సైగా పదోన్నతి పొందారు. ఐదు నెలల సర్వీస్ మిగిలి ఉండగానే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ నిర్ణయం తీసుకుని ఎన్నికల బరిలోకి దిగారు. తాను పుట్టి పెరిగిన గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పిన ఆయనకు గ్రామస్తులు అండగా నిలవకపోవడం గమనార్హం.

# వార్డుల పునర్విభజనపై అభ్యంతరాలు

- భారీగా వినతులు అందజేస్తున్న నేతలు
- ప్రధానంగా ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యేల అభ్యంతరం



**హైదరాబాద్, డిసెంబరు 15:** జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై భారీగా అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల శివారు ప్రాంతాలను విలీనం చేయడంతో 300 వార్డులు ఏర్పాడ్డాయి. అయితే దీనిపై అభ్యంతరాల స్వీకరణ సోమవారంతో పూర్తి అయ్యింది. ఈ క్రమంలో మంగళవారం బల్దియా ప్రత్యేక కౌన్సిల్ సమావేశం కానుంది. ఈ కౌన్సిల్‌లో కార్పొరేటర్ల అభిప్రాయాన్ని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తీసుకోనున్నారు. తద్వారా వార్డులు పునర్విభజన ఏమైనా ఉంటే చేస్తారు. ఇప్పటి వరకు 1,328 అభ్యంతరాలు వచ్చాయి. ఆదివారం ఒక్కరోజే 227 అభ్యంతరాలు స్వీకరించారు అధికారులు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్, జోనల్, సర్కిల్ ఆఫీసుల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు జీహెచ్ఎంసీ అధికారులు. 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలపడానికి జీహెచ్ఎంసీకి క్యూ కట్టారు నగర ఎమ్మెల్యేలు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు కార్పొరేటర్లతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సమావేశం అయ్యారు. వార్డుల పునర్విభజన శాస్త్రీయంగా చేయాలంటూ మేయర్‌కు వినతిపత్రం ఇచ్చారు కాంగ్రెస్ కార్పొరేటర్లు. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నేతృత్వంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలవనున్నారు. నగర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు. వార్డుల విభజనపై అభ్యంతరాలు తెలపనున్నారు. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వార్డుల విభజనపై తమకు కన్ఫ్యూజన్ ఉందని తెలిపారు. డీ లిమిటేషన్‌పై అభ్యంతరం తెలపడానికి కమిషనర్‌ను కలిశామని వెల్లడించారు. కనీసం తమకు సమాచారం లేకుండానే, ఎమ్మెల్యేల అభిప్రాయం లేకుండానే డీ లిమిటేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డీ లిమిటేషన్‌పై కార్పొరేటర్లలో ఆవేదన ఉందని చెప్పుకొచ్చారు. తమ అభ్యంతరాలు మేయర్, కమిషనర్‌కి లిఖిత పూర్వకంగా ఇచ్చామని వివరించారు. జీహెచ్ఎంసీ విస్తరణ జరగడం బాగుందని.. కానీ తమకు కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని... వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. డివిజన్ల విభజనపై ఎలాంటి సమస్యలు ఉన్నాయనే అంశాలు గుర్తించామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కొన్ని డివిజన్‌లలో ఎక్కువ ఓట్లు మరికొన్ని డివిజన్‌లలో తక్కువ ఓట్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రతి విషయాన్ని మేయర్, కమిషనర్‌లకు వివరించామని అన్నారు. కౌన్సిల్‌లో అభ్యంతరాలపై వివరంగా చర్చిస్తామని తెలిపారు. వార్డులు మార్పు చేయడానికి ఏం అవకాశం ఉందో గుర్తించాలని అన్నారు. హద్దులు తెలియకుండా అధికారులు వాటిని ఖరారు చేశారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు.

# కోఠి ఉమెన్స్ కాలేజీలో వేధింపులు

- వెలుగులోకి ఫోన్ కాల్ రికార్డ్!
- మెస్‌ఇన్‌చార్జ్‌పై షీటీమ్‌కు ఫిర్యాదు
- ఆరోపణలపై విచారణ కమిటీ
- చర్యలు తీసుకోవాలి: రాజాసింగ్



**హైదరాబాద్, డిసెంబర్15:** హైదరాబాద్‌లోని చారిత్రాత్మక కోఠి ఉమెన్స్ కాలేజీలో లైంగిక వేధింపుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వర్సిటీలో పీజీ చదువుతున్న విద్యార్థినులను గర్ల్స్ హాస్టల్ మెస్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న వినోద్ లైంగికంగా వేధిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. రక్షణగా నిలవాల్సిన బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తుండటంపై విద్యార్థినులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో ఉండాలంటేనే భయం వేస్తోందని, నిత్యం వినోద్ వేధింపుల వల్ల తాము తీవ్ర మానసిక ఒత్తిడికి, ఇబ్బందులకు గురవుతున్నామని యువతులు వాపోతున్నారు.

### రంగంలోకి ఎమ్మెల్యే రాజాసింగ్

ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయన నేరుగా కోఠి ఉమెన్స్ కాలేజీకి వెళ్లి అక్కడ జరుగుతున్న పరిణామాలపై ఆరా తీశారు. విద్యార్థినులకు ధైర్యం చెబుతూనే, ఆరోపణలు ఎదుర్కొంటున్న మెస్ ఇన్‌ఛార్జ్ వినోద్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కాలేజీ యాజమాన్యాన్ని మరియు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకునేంతవరకు వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

### షీటీమ్స్‌కు ఫిర్యాదు.. అధికారుల నిర్లక్ష్యం

మరోవైపు వినోద్ ఆగడాలపై బాధితులు ధైర్యంగా ముందుకొచ్చి షీటీమ్స్‌కు ఫిర్యాదు చేశారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ కొన్ని ఆడియో మెసేజ్‌లను కూడా అధికారులకు పంపించారు. అయితే, ఈ విషయమై తాము ఇప్పటికే కాలేజీ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థినులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఫిర్యాదులను పట్టించుకోకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

### వేధింపులపై కమిటీతో విచారణ

లైంగిక వేధింపుల ఆరోపణలపై వర్సిటీ ప్రిన్సిపాల్ లోక పావని స్పందించారు. మెస్ ఇంచార్జ్ వినోద్ తప్పు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులతో పాటు యూనివర్సిటీ నుంచి ప్రత్యేక కమిటీని వేసి విచారిస్తున్నామన్నారు. విద్యార్థులపై వేధింపులు జరిగాయని స్థానిక పోలీసులు ఇప్పటికే సమాచారం అందించారని.. వేధింపులపై హాస్టల్ వార్డెన్‌కు, ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు గతంలో ఎలాంటి ఫిర్యాదులు చేయలేదని తెలిపారు. మెస్ ఇంచార్జ్ వినోద్‌పై గతంలో ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. లైంగిక వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన విద్యార్థులు ఎవరో తెలియదని చెప్పారు. ఫిర్యాదు చేసిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోని టార్గెట్ చెయ్యమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సమస్యలుంటే మొదటగా తమకు చెప్పాలని కోరారు. విద్యార్థులు అభద్రతా భావానికి గురి కావద్దని సూచించారు. యూనివర్సిటీ, హాస్టల్ మెస్‌లో విద్యార్థుల వసతులకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. హాస్టల్‌లో తక్కువ స్థలంలో ఎక్కువ మంది విద్యార్థులు వసతి ఉంటున్నారని తెలిపారు. సీసీ కెమెరాలు కొరత వేధిస్తోందని చెప్పారు.



## కామారెడ్డి జిల్లాలో దారుణం..
## గెలిచిన సర్పంచ్ తమ్ముడి దాష్టీకం

### ఓడిన సర్పంచ్ అభ్యర్థి తదితరులపై ట్రాక్టర్‌తో దాడి

### దాడిలో పలువురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

**కామారెడ్డి,డిసెంబర్ 15:** తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. అప్పుడే కక్షలు కార్పణ్యాలు బయటపడుతున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమాతో బరిలోకి దిగిన అనేక మంది ఆశలు అడియాశలుగా మిగిలిపోయాయి. సర్పంచ్ ఎన్నికల కోసం భారీగా డబ్బులు వెచ్చించి ప్రచారాలు నిర్వహించారు. ఓటర్లను ఆకర్షించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. ఇంత చేసినా కూడా కొంతమందిని మాత్రమే సర్పంచ్ పీఠం వరించింది. మరికొందరు గెలుస్తామని ధీమాగా ఉన్నవారు సైతం ఓటమి చెందారు. ఇదిలా ఉండగా కొన్ని ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు కక్షలకు దారి తీశాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. అయితే కామారెడ్డిలో మాత్రం అంతా రివర్స్ అయ్యింది. గెలిచిన అభ్యర్థికి చెందిన బంధువులు.. ఓడిపోయిన అభ్యర్థిపై కక్ష తీర్చుకునే ప్రయత్నం చేయడం సంచలనంగా మారింది. జిల్లాలోని సోమార్‌పేటలో ఎన్నికల కక్షలు భగ్గుమన్నాయి. ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి బాలరాజును గెలిచిన సర్పంచ్ తమ్ముడు ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐదుగురుకు గాయపడ్డారు. వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. గెలిచిన అభ్యర్థి పాపయ్య తమ్ముడు చిరంజీవికి, ప్రత్యర్థి బాలరాజు వర్గంతో గొడవ జరిగింది. చిన్న గొడవ కాస్తా చిలికి చిలికి గాలివానగా మారింది. ఆవేశంతో ఊగిపోయిన గెలిచిన అభ్యర్థి తమ్ముడు.. బాలరాజును ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఓడిన అభ్యర్థి బాలరాజుతో పాటు గంజి భారతి, బాలమణి, స్వరూప, పద్మ సత్యవ్వలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఐసిస్‌తో సంబంధాలు

### ఇద్దరు ఉగ్రవాదుల అరెస్ట్



**ముంబై, డిసెంబర్15:** ముంబైలో ఇద్దరు ఉగ్రవాదులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాజన్, మనీష్ బేడీ అనే ఇద్దరు టెర్రరిస్టులు పాకిస్థాన్‌లోని ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరంతా ఆర్మేనియా నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెలలో ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా సోదాలు నిర్వహిస్తుంది. అధికారులు ఇదివరకే పలువురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎర్రకోట వద్ద జరిగిన బాంబుపేలుళ్లలో 15 మంది మృతిచెందగా, అనేక మంది గాయపడ్డారు. కాగా ఈ ఘటనతో సంబంధమున్న నిందితులను దర్యాప్తు బృందాలు ఇది వరకే అరెస్టు చేశాయి. వీరిద్దరూ దుబాయ్, ఆర్మేనియా సహా విదేశాల్లో నుంచి పనిచేస్తూ పంజాబ్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర నిఘా సంస్థల రహస్య సమాచారంతో పంజాబ్ పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ లో వీరి ఇద్దరినీ అరెస్ట్ చేసినట్టు డీజీపీ వెల్లడించారు.

## స్టీల్ ఫ్యాక్టరీలో పేలుడు : ఒకరు మృతి



**మెదక్,డిసెంబర్ 15:** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం చెట్లగౌరారంలోని ఎంఎస్ స్టీల్ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలికి వెళ్లేందుకు ప్రయత్నించిన కార్మికులు, గ్రామస్థులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## రోడ్డు దాటుతుండగా కారు ఢీ

### వైద్య విద్యార్థిని దుర్మణం



**హైదరాబాద్, డిసెంబర్ 15:** నగరంలోని హయత్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటనలో ఎంబీబీఎస్ విద్యార్థిని ఐశ్వర్య మృతిచెందారు. ఆర్టీసీ కాలనీ వద్ద తన తండ్రి పాండుతో కలిసి రోడ్డు దాటుతుండగా అతివేగంతో వచ్చిన కారు వారిని ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన ఐశ్వర్య, పాండును ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఐశ్వర్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం పాండును వేరే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఐశ్వర్య మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.



సంపాదకీయం

# బీజేపీ స్వయంకృతం!

పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ చతికిల పడింది. వచ్చిన సీట్లను చూసి మురిసిపోతై మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. కనీసం మూడో స్థానంలో ఉండాల్సిన సంఖ్యలో కూడా సర్పంచ్ పదవులను గెల్చుకోఏక పోయింది. ఈ క్రమంలో ఇక కాషాయ పార్టీ బలపడడం ఇప్పట్లో అసాధ్యమన్న భావన వస్తోంది. ప్రజలు మందలించినా, ప్రజలు ఛీత్కరించుకుంటున్నా..తెలంగాణ బీజేపీలో మార్పు కానరావడం లేదు. అధికార కాంగ్రెస్‌ను విమర్శించడమే లక్ష్యంగా పార్టీ ప్రస్థానం సాగుతోంది. ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా చెప్పుకోదగ్గ రీతిలో రాష్ట్రానికి నిధులు విడుదల జరగడం లేదు. పనులు సాగడం లేదు. ఇది గత పుష్కరకాలంగా ఇలాగే సాగుతోంది. ఈ క్రమంలో ప్రజలు బీజేపీని ఎందుకు నమ్ముతారన్నది గమనించడం లేదు. పక్కన ఎపిలో బీజేపీ నేతలు కేందరం నుంచి అనేక పనులు రాబట్టుకుంటున్నారు., ప్రాజెక్టులను సాధిస్తున్నారు. కానీ తెలంగాణలో కనీసం రోడ్లకు దిక్కులేదు. కంటోన్మెంట్ భూములల బదలాయింపుకు ఇప్పటికీ పేచీలు తప్పడం లేదు. రాష్ట్రం ఏదైనా కోరితే కొర్రీలు తప్ప మరోటి కానరావడం లేదు. ఇద్దరు కేంద్రమంత్రులు, మరో ఏడుగురు ఎంపిలు ఉన్నా లాభం కనిపించడం లేదు. అందుకేనేమో బీజేపీ పని తీరుపై ఇటీవల ప్రధాని మోడీ గట్టిగానే హెచ్చరించారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, మరో ఎనిమిది మంది ఎంపీలు పార్టీకి ఉన్నా బలమైన పార్టీగా ఉంటూ.. రాష్ట్రానికి ఎంతో చేయవచ్చు. అలాగే ఓబీసి మోర్చా నేతగా మరో రాజ్యసభ ఎంపి లక్ష్మణ్ కూడా ఉన్నారు. వీరంతా కాంగ్రెస్‌ను తిట్టిపోయడం తప్ప మరో పని పెట్టుకోలేదు. దీనికితోడు అంతర్గత కుమ్ములాటలు గతంలో ఎప్పుడూ లేనంతగా కనిపిస్తు న్నాయి. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ విమర్శలకే పరిమితం అవుతున్నారు. ప్రజలను అకకున చేర్చుకునే పనులేవీ కనిపించడం లేదు. దాదాపు ఐదేళ్ల క్రితం జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠానికి చేరువగా వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని, అప్పుడు ఒకటి రెండు సీట్లకు పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ అవతరించింది. ఆ తర్వాత బండి సంజయ్ నాయకత్వం లో మరింత దూకుడు ప్రదర్శించింది. ఈ నేపథ్యంలో శాసనసభ ఎన్నికలకు ముందు బండి సంజయ్ నాయకత్వాన్ని మార్చారు. ఎందుకు మార్చారో తెలియదు. కానీ అప్పటి నుంచి పార్టీ దూకుడు తగ్గింది. ఆ ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై పడింది. అధికారంలోకి వస్తామనుకున్న బీజేపీని ప్రజలు పక్కన పెట్టారు. ఇప్పుడ సర్పంచ్ ఎన్నికల్లో కూడా గట్టిగా బుద్ధి చెప్పారు. రెండువిడతల్లో కలిపి స్వతంత్రులకు వచ్చిన స్థానాలు కూడా రాలేదు. పంచాయితీ ఎన్నికల్లో సత్తా చాటలేదు. జూబ్లీహిల్స్ ఎన్నికలో డిపాజిట్ కోల్పోయారు. అయినా వారిలో పరివర్తన కానరావడం లేదు. ఆత్మపరిశీలన చేసుఓవడం లేదు. దీనికితోడు బండి, ఈటెల మధ్య అంతర్గత కుమ్ములాటలు రాజుకుంటు న్నాయి. పార్టీ రాష్ట్ర నాయకుల మధ్య నెలకొన్న అంతర్గత కుమ్ములాటలు మరొక కారణంగా పార్టీ అడుగులు ముందుకు పడడం లేదు. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న పట్టుదలతో వివిధ పార్టీలకు చెందిన బలమైన నాయకులను బీజేపీలో చేర్చుకున్నారు. దీంతో భవిష్యత్తుపై పార్టీ శ్రేణుల్లో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో శాసనసభకు ఎన్నికలు రావడం, పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను తప్పించడం జరిగింది. దీంతో ఎందుకనో ప్రజలు బీజేపీ పట్ల నమ్మకాన్ని కోల్పోయారు. బిఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారన్న వార్తలు బలంగా ప్రసారం కావడంతో బీజేపీకి ఎదురుదెబ్బలు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి బీజేపీ స్వయంకృతాపరాధం తప్ప మరోటి కాదు.. ఆ తర్వాత ఆరు నెలలకు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి చెందిన బలమైన నాయకులను బీజేపీ కేంద్ర నాయకత్వం ఎన్నికల బరిలోకి దించింది. దీంతో కాంగ్రెస్‌తో సమానంగా ఎనిమిది స్థానాలను పార్టీ గెలుచు కోగలిగింది. ఆ తర్వాత నుంచి రాష్ట్రంలో భారతీ–య జనతా పార్టీకి కష్టాలు మొదలయ్యాయి. నివురుగప్పిన నిప్పులా పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు పార్టీని దెబ్బతీశాయి. గ్రేటర్ హైదరాబాద్ లో పార్టీ మొదటి నుంచీ బలంగా ఉండేది. ఎమ్మెల్యే రాజాసింగ్ లాంటి వారు ఇదే విషయమై నిలదీస్తున్నా కేంద్ర నాయకత్వం పట్టించుకోలేదు. ఆయనను పార్టీలో కొనసాగించేందుకు ఎవ్వరు కూడా ప్రయత్నించలేదు. అందుకే బీజేపీ బలం 8 నుంచి ఏడుకు పడిపోయింది. కేంద్రంలో అధికారంలో ఉన్నందున లబ్ది పొందాల్సిన పార్టీ ఆ దిశగా కృషి చేయడంలేదు. మరోవైపు కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయమని ప్రజలను నమ్మించే దిశగా కూడా పనిచేయడం లేదు. ప్రజా బలం ఉన్న నాయకులు పార్టీలో చేరినప్పటికీ పార్టీలో ఛరిష్మా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే బీసీ నాయకత్వం అంశం కూడా తెరపైకి వచ్చింది. పార్టీకి బీసీలే నాయకత్వం వహించాలన్న డిమాండ్ అంతర్గతంగా బలపడుతూ వచ్చింది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ కూడా బీజేపీ తన పట్టును ప్రదర్శించలేక పోయింది. తాజాగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కూడా పార్టీ పరిస్థితి అధ్వానంగా మారింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కూడా సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పనితీరు పేలవంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తర్వాత పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రయత్నాలు జరిగిన దాఖలాలు లేవనడానికి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. తిరువనంతపురంలో గెలిచిన బీజేపీ తెలంగాణలో మాత్రం చతికిల పడింది. ఇందుకు పార్టీ నేతల లోపభూయిష్ట విధానాలే కారణంగా చూడాలి.



# బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్

- పార్టీ కార్యాలయంలో బాధ్యత స్వీకరణ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** బీజేపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన బీహార్ మంత్రి నితిన్ నబిన్ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఇతర పార్టీ నాయకుల సమక్షంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. బీజేపీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న తర్వాత నితిన్ నబిన్‌కు ఘన స్వాగతం లభించింది. అమిత్‌షా, నడ్డా, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, రవిశంకర్ ప్రసాద్, ఢిల్లీ సీఎం రేఖ గుప్తా సహా వివిధ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం చెప్పారు. అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి నబిన్ మాట్లాడుతూ.. నాలాంటి చిన్న కార్యకర్తకు పార్టీ చాలా పెద్ద బాధ్యత అప్పగించిందన్నారు. కార్యకర్తల నిబద్ధత, కృషిని పార్టీ గుర్తిస్తుందనడానికి ఇదే నిదర్శమని చెప్పారు. దివంగత నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా కొడుకే నితిన్ నబీన్. కాయస్త కమ్యూనిటీకి చెందిన ఆయన.. ఇప్పటివరకూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2006లో ఆయన తండ్రి నవీన్ కిశోర్ మరణంతో పాట్నా వెస్ట్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికకు బీజేపీ అధిష్టానం నితిన్‌ను నిలబెట్టింది. అప్పటి నుంచి గత రెండు దశాబ్దాల్లో ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహిస్తోన్న నబిన్ బీహార్ ప్రజా పనుల శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబిన్‌ను నియమించింది. త్వరలోనే బీజేపీ జాతీయ అధ్యక్షుడిగానూ ఆయనకు బాధ్యతలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు బీజేపీ వర్గాల సమాచారం.

# పహల్గాం ఉగ్రదాడి కేసు

## జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు




**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** పహల్గాం ఉగ్రదాడి కేసులో దర్యాప్తు చేస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ సోమవారంనాడు జమ్మూలోని ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. దాడి ప్రధాన సూత్రధారిగా పాకిస్థాన్ నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తొయిబా కమాండర్ జాజిద్ జాట్ ను పేర్కొంది. హహల్గాం దాడి కేసులో లష్కరే తొయిబా, దాని ఫ్రంట్ ఆర్గనైజేషన్ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'తో సహా ఏడుగురు నిందితులపై ఎన్ఐఏ ఛార్జిషీటు నమోదు చేసింది. హహల్గాం దాడిలో పాకిస్థాన్ కుట్ర, నిందితుల పాత్ర, వాటిని బలపరచే సాక్ష్యాలను ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. నిషేధిత ఎల్ఈటీ/టీఆర్ఎఫ్ సంస్థ ఈ కుట్రకు ప్రణాళిక రచించి దాన్ని అమలు చేసినట్టు తెలిపింది. మతం పేరు అడిగిమరీ పాక్ స్పాన్సర్డ్ ఉగ్రవాదులు ఈ దారుణానికి పాల్పడ్డారని, ఒక పౌరుడు సహా 25 మంది టూరిస్టులను పొట్టనపెట్టుకున్నారని పేర్కొంది. ఈ మేరకు 1,597 పేజీల ఛార్జిషీటును ప్రత్యేక కోర్టుకు ఎన్ఐఏ సమర్పించింది. ఉగ్రదాడి అనంతరం జూలైలో చేపట్టిన ఆపరేషన్ మహదేవ్‌లో భారత బలగాలు మట్టుబెట్టిన ముగ్గురు పాక్ ఉగ్రవాదుల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఈ ఉగ్రవాదులను ఫైసల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్గానిగా పేర్కొంది. ఈ ముగ్గురితో పాటు సాజిద్ జాట్, ఎల్ఈటీ/టీఆర్ఎఫ్‌పై వివిధ సెక్షన్ల కింద అభియోగాలను మోపింది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారనే కారణంగా జూన్ 22న అరెస్టు చేసిన మరో ఇద్దరు నిందితులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌ల పేర్లను కూడా ఛార్జిషీటులో ఎన్ఐఏ చేర్చింది. ఇంటరాగేషన్‌లో ఈ ఇద్దరూ దాడిలో ప్రమేయమున్న మరో ముగ్గురు సాయుధ ఉగ్రవాదుల వివరాలను వెల్లడించారు. ఈ ముగ్గురూ ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా పనిచేసిన పాక్ ఉగ్రవాదులని అంగీకరించారు.పాక్‌కు చెందిన మోస్ట్ వాంటెండ్ టెర్రరిస్టు సాజిద్ జాట్. ఇతనిపై ఎన్ఐఏ రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించింది. అతని అసలు పేరు హబీబుల్లా మాలిక్. పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని కసూర్ జిల్లావాసి. సైఫుల్లా, నోమి, నూమన్, లంగ్డా, అలీ సాజిద్, ఉస్మాన్ హబీబ్, షాని అనే పేర్లు కూడా ఇతనికి ఉన్నాయి. టీఆర్ఎఫ్ టాప్ కమాండర్‌గా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ప్రధాన ఉగ్రదాడుల్లో ఇతని ప్రమేయం ఉంది. 2022 అక్టోబర్‌లో యూఏపీఏ కింద అధికారికంగా వాంటెడ్ టెర్రరిస్టుగా ప్రకటించారు. ఇస్లామాబాద్‌లో ఎల్ఈటీ ప్రధాన కార్యాలయం నుంచి ఇతను భారత్‌లో ఉగ్రవాదాన్ని నడిపించే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాడని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. భారత ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారంటూ సాజిత్ జాట్‌పై పలు ఛార్జిషీటు సైతం ఎన్ఐఏ నమోదు చేసింది. కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత టెర్రర్ నెట్‌వర్క్‌ను నడుపుతున్న అత్యత ప్రమాదకరమైన వ్యక్తుల్లో ఒకరిగా సాజిద్‌ను భద్రతా సంస్థలు చెబుతున్నాయి.



# గ్రామీణ ఉపాధి చట్టం రద్దుకు యత్నం?

## దాని స్థానే కొత్త బిల్లుకు రూపకల్పన

**న్యూఢిల్లీ, డిసెంబర్ 15:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీని స్థానంలో గ్రామీణులకు ఉపాధి కోసం కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన బిల్లు ప్రతులను సోమవారం లోక్‌సభ సభ్యులకు అందించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో తీసుకొచ్చారు. ఇప్పుడు దాన్ని రద్దు చేసి కొత్తగా.. వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ బిల్లు, 2025ను తీసుకురానున్నట్లు సమాచారం. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధిని సాధించే దిశగా ఈ కొత్త పథకాన్ని రూపొందించినట్లు బిల్లులో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబానికి సంవత్సరంలో 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధికి హామీని ఇవ్వడంతో పాటు సంపన్న, సుస్థిర గ్రామిాణ భారత్‌ను సాధించడం వంటి లక్ష్యాలను కొత్త చట్టంలో ప్రతిపాదించినట్లు సమాచారం. ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. ఇటీవలే గ్రామిాణ ఉపాధి హామీ పథకం పేరును.. పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్చిన సంగతి తెలిసిందే. అలాగే పనిదినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామిాణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు.

# శ్రీవారి ఆర్జిత సేవల :మార్చి నెల టికెట్ల విడుదల

**తిరుమల, డిసెంబర్ 15:** భక్తుల సౌకర్యార్థం 2026 మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవల కోటాను ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ లక్కీడిప్ కోసం 20న ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అంగప్రదక్షిణ టోకెన్లను ఇదే విధానంలో నమోదు చేసుకున్నాక ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా జారీచేస్తారు. లక్కీడిప్‌లో టికెట్లు పొందిన భక్తులు 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది.

# జోర్డాన్‌లో ప్రధాని మోడీ ఘన స్వాగతం

## భారత సంతతి ప్రజల ఆనందం



**అమ్మాన్, డిసెంబర్ 15:** భారతీయ సంతతి భారత్–జోర్డాన్ సంబంధాలకు గణనీయమైన కృషి చేస్తున్నారని భారత ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధాని మోదీకి జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో భారతీయ సంతతి నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మూడు దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి జోర్డాన్‌కు చేరుకున్న ప్రధాని మోదీని హోటల్ వద్ద జోర్డాన్ లోని భారత సంతతికి చెందిన వారు భారత జాతీయ జెండాను చేతబట్టి ప్రధాని మోదీకి నమస్కరించి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని వారిని ప్రేమతో పలుకరించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ డిసెంబర్ 15 నుంచి 18 వరకు జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడు దేశాల్లో పర్యటిస్తారు. ఈ పర్యటన ద్వారా ఆయా దేశాలతో పురాతన సంస్కృతిక సంబంధాలతో పాటు ఆధునిక ద్వైపాక్షిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేయాలన్నది ప్రధాని పర్యటన ప్రధాన లక్ష్యం. ప్రధాని మోదీ.. జోర్డాన్ సందర్శన భారత్–జోర్డాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరుగుతోంది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ.. జోర్డాన్ రాజు అబ్దుల్లా ఎఏ ఇబ్న్ అల్ హుస్సేన్, ఆ దేశ ప్రధాని జాఫర్ హసన్‌లతో భేటీ కానున్నారు. జోర్డాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఇథియోపియా, ఒమన్ దేశాల్లో పర్యటిస్తారు.

# శభాష్ వెలిచాల

- కరీంనగర్‌లో 20లో 11మంది సర్పంచులను గెలిపించడం గ్రేట్..
- మంత్రి తుమ్మల, సీఎం సలహాదారు అభినందనలు



**నేటి సాక్షి, కరీంనగర్:** కరీంనగర్ నియోజకవర్గంలో 20 గ్రామ పంచాయతీలకు గానూ 11మంది కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించిన కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావును కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కరీంనగర్ రూరల్ మండలం, కొత్తపల్లి మండలంలో 11మంది కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచులుగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన రాజేందర్ రావును శభాష్ అని వారు అభినందనలు తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో గెలిచిన 11మంది కాంగ్రెస్ సర్పంచులు, ఉప సర్పంచులు వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాదులో సోమవారం మంత్రి తుమ్మల, సీఎం సలహాదారును మర్యాద పూర్వకంగా కలిశారు. ఘనవిజయం సాధించిన సర్పంచులు, ఉప సర్పంచులకు వారు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, సీఎం సలహదారు మాట్లాడుతూ.. సర్పంచులు, ఉప సర్పంచులు గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో సర్పంచులుగా ఉప సర్పంచులుగా గెలిపించారని వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా నిలవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో తమరి గెలుపునకు ప్రత్యేకంగా రాజేంద్రరావు కృషి చేయడం అభినందనీయమన్నారు. అభ్యర్థులు విజయం సాధించే వరకు వెన్నంటే ఉండి గెలిపించే వరకు రాజేందర్ రావు వెన్నుదన్నుగా నిలవడం హర్షనీయమన్నారు. గ్రామాల్లో దగ్గరుండి అందర్నీ సర్పంచులుగా గెలిపించిన రాజేంద్ర రావు పేరును నిలబెట్టాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నిధులు మంజూరుకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. 20 రోజులపాటు కరీంనగర్ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో ఉండి, 11 మంది సర్పంచులుగా గెలిపించేందుకు అహర్నిశలు కృషి చేశానని రాజేందర్ రావు వారికి వివరించారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుకు మంచి స్పందన లభించిందని పార్టీ గ్రాఫ్ పెంచేందుకు తన శక్తుల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల సర్పంచ్ నిమ్మల అంజయ్య, ఉపసర్పంచ్ గసికంటి కుమార్, చేగుర్తి సర్పంచ్ భాషవేణి సరోజన మల్లేష్ యాదవ్, ఉప సర్పంచ్ గాలిపెల్లి రవీందర్, నల్లగుంటపల్లి సర్పంచ్ వడ్లూరీ అంజయ్య, చర్లబుత్కూర్ సర్పంచ్ కూర నరేష్ రెడ్డి, దుబ్బపెల్లి సర్పంచ్ మోతే ప్రశాంత్ రెడ్డి, శ్రావణపల్లి సర్పంచ్ బోగొండ ఐలయ్య, ఫకీర్‌పేట సర్పంచ్ బొద్దుల విజయ లక్ష్మీనారాయణ, జూబ్లీ నగర్ సర్పంచ్ సుద్దాల కమలాకర్ ఎలబోతారం సర్పంచ్ తిప్పట్ల రాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంధన పొదుపుతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు




- మహోద్యమంగా ఇంధన పొదుపును ముందుకు తీసుకెళ్దాం
- నికర శూన్య ఉద్గారాల లక్ష్యాన్ని చేరుకుందాం
- ప్రతిఒక్కరూ ప్రొడ్యూసర్‌గా మారాల్సిన అవసరముంది
- సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా సమష్టిగా కృషిచేద్దాం
- ఇంధన సంరక్షణలో వరుస అవార్డులతో రాష్ట్రానికి నూతనుత్తేజం
- ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ:** సమష్టి భాగస్వామ్యంతో ఇంధన పొదుపుతో స్వర్ణాంధ్ర 2047 దిశగా అడుగులు వేద్దామని.. మహోద్యమంగా ఇంధన పొదుపును ముందుకు తీసుకెళ్దామని ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు-2025 (డిసెంబర్ 14-20)లో భాగంగా సోమవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వరకు జరిగిన ర్యాలీ, స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీ జెన్‌కో ఎండీ ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి, నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఏపీ సీపీడీసీఎల్.. బీఈఈ సౌజన్యంతో స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, పవర్ యుటిలిటీ డైరెక్టర్లు తదితరులతో కలిసి జాతీయ ఇంధన పొదుపు పోస్టర్లను ఆవిష్కరించారు. అత్యంత విలువైన విద్యుత్ ఏ రూపంలోనూ వృధా కాకుండా ఎల్లప్పుడూ జాగ్రత్తగా వ్యవహరిస్తానని.. విద్యుత్ పొదుపు సందేశం అందరికీ చేరేలా పాటుపడతానంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జెన్‌కో ఎండీ నాగలక్ష్మి మాట్లాడుతూ వ్యక్తులు, పారిశ్రామిక సంస్థలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిఒక్క వ్యక్తి, సంస్థా ఇంధన పొదుపు దిశగా పయనించాలని.. భవనాలు కూడా హరిత ప్రమాణాలను పాటించాలని కోరారు. ఇప్పటికే 1,400 వరకు వాణిజ్య భవంతులు ఇంధన పొదుపు ప్రమాణాలను పాటిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రతిఒక్కరూ ప్రొద్యూమర్ (ప్రొడ్యూసర్ ప్లస్ కన్స్యూమర్)గా ఎదగాలన్నారు. నికర శూన్య ఉద్గారాలు (నెట్ జీరో ఎమిషన్) అనేది స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక లక్ష్యమని.. దీని సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందని, ఇంధన పరిరక్షణ, సామర్థ్యంలో ఏపీ వరుసగా జాతీయస్థాయి అవార్డులు సొంతం చేసుకుంటోందని.. సమష్టి కృషే ఇందుకు నిదర్శనమని ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. ఇంధనాన్ని వృధా చేస్తే డబ్బును వృధా చేసినట్లేనని.. ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తెరిగి సేవ్ ఎనర్జీ - సేవ్ మనీ నినాదాన్ని సరైన విధంగా అర్థం చేసుకుంటూ ఇంధన పొదుపును పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. విద్యుత్‌ను ఆదా చేసే గృహోపకరణాలను వినియోగించడం ద్వారా 25-30 శాతం విద్యుత్‌ను ఆదా చేయొచ్చన్నారు. మీరు వినియోగించుకోగా అదనంగా ఉత్పత్తి చేసిన విద్యుత్‌కు ప్రభుత్వం నుంచి తిరిగి డబ్బు పొందేందుకు వీలుకల్పించే పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ.. ఇంధన పొదుపును ప్రతిఒక్కరూ తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని.. సౌర, పవన తదితర పునరుత్పాదక ఇంధన వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యకర పర్యావరణాన్ని భావితరాలకు బహుమతిగా అందిద్దామన్నారు. మనకు ఎంత అవసరమో అంతే విద్యుత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ లేనిదే అడుగు కూడా ముందుకేయలేని పరిస్థితి అని.. నాణ్యమైన విద్యుత్‌ను సరసమైన ధరలకు అందించినప్పుడే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ దాదాపు 13 వేల మెగావాట్లు కాగా.. ఏటా ఇది ఏడు నుంచి 10 శాతం పెరుగుతోందని, ఈ నేపథ్యంలో విద్యుదుత్పత్తితో పాటు విద్యుత్ పొదుపును కూడా అలవరచుకోవాల్సిన అవసరముందన్నారు. ఒక యూనిట్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్లను ఉత్పత్తి చేసేనట్లేనని పేర్కొన్నారు. నెడ్‌క్యాప్ వీసీ, ఎండీ కమలాకర్ బాబు మాట్లాడుతూ విద్యుత్ పరిరక్షణలో ఏపీ నెం.1గా ఉంటోందని, మిషన్ మోడ్‌లో విద్యుత్ పొదుపు కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఇంధన పొదుపు చర్యలతోనే భావితరాలకు ఇంధన భద్రత సాధ్యమవుతుందన్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించడంతో పాటు ఇంధన వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీలు, సమావేశాలు తదితరాలతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాజాత ప్రదర్శనలతో విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, పవర్ యుటిలిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో అభివృద్ధి జోరు

రూ.1.26 కోట్ల పనులకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శంకుస్థాపన



**తడ:** మండలంలో పలు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు వేగం వచ్చింది. పూడి కుప్పం, కారూరు కొత్త కుప్పం గ్రామాలలో సెయింట్ గోబైన్, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా కంపెనీల సహకారంతో నిర్మించిన రూ. 66 లక్షల వ్యయంతో అంగన్వాడీ భవనాలు, రూ. 60 లక్షలతో చేపట్టిన సీసీ డ్రైన్ల పనులను స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మేనకూరు, మాంబట్టు, అత్తివరం, శ్రీ సిటీ సెజ్ పరిధిలోని పరిశ్రమలు తమ సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో పరిసర గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మౌలిక వసతుల మెరుగుదలతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఆమె పేర్కొన్నారు. అంగన్వాడీ భవనాలు, సీసీ డ్రైన్ల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన సెయింట్ గోబైన్, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా కంపెనీలకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె సూచించారు.

# ప్రజల గడప వద్దే పాలన

గుడ్ మార్నింగ్ ఎమ్మెల్యే కార్యక్రమంతో ప్రజలతో విజయశ్రీ మమేకం





**సూళ్లూరుపేట:** పట్టణంలో సోమవారం నిర్వహించిన 'గుడ్ మార్నింగ్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. సోనియా గాంధీ నగర్, వాకాటి నారాయణ రెడ్డి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. త్రాగునీటి కొరత, రహదారుల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్య లోపాలు వంటి అంశాలను ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆ ప్రాంతంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి మానవీయతను చాటారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చివరి రోజు భవాని దీక్షల సేవల్లో జిల్లా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు




**విజయవాడ:** ఈనెల 11 నుంచి 15 వరకు జరుగుతున్న భవాని దీక్షల విరమణ సేవలలో 100 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మేరిస్టెల్లా కళాశాల, విజయ ఇన్స్టాప్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ మరియు కేబీఎన్ కళాశాల) పాల్గొని భవాని దీక్షల విరమణకు విచ్చేసిన భక్తులకు దేవస్థానం వారు ఏర్పాటుచేసిన సదుపాయాలు (అన్నప్రసాదాలు, లడ్డు ప్రసాదాలు, తాగునీరు, మెడికల్, సానిటరీ, క్యూ లైన్లు, పాలు, చంటి పిల్లలకు ట్యాగ్) మొదలగు సదుపాయాలు మీద అభిప్రాయ సేకరణ నిర్వహించినట్లు జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు.

ఐదు రోజులు పాటు నిర్వహించిన అభిప్రాయ సేకరణ సర్వేలో సుమారు 10,232 మంది భక్తుల నుండి అభిప్రాయ సేకరణ సేకరించినట్లు వారందరూ దేవస్థానం వారు కల్పించిన సదుపాయాల మీద సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఒక్క క్యూ లైన్ లో నియంత్రణ మినహా మిగతా అన్ని సదుపాయాలు చాలా చక్కగా ఉన్నాయని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ చేయడం పట్ల విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు ఇలాంటి సేవలు చేయడం తమకు లభించిన అవకాశంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ, ఈవో శీను నాయక్, ఏవో గంగాధరంలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.'

# షుగర్ ఉన్నవారు పాటించాల్సిన చిట్కాలు ఇవి..

## వీటితో షుగర్‌ను గణనీయంగా అదుపు చేయవచ్చు



దయాబెటిస్.. నేడు ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మందిని భయపెడుతున్న జబ్బు ఇది. దీని కారణంగా మన దేశంలో ఏటా కొన్ని కోట్ల మంది కొత్తగా షుగర్ వ్యాధి ప్రపంచంలో అడుగు పెడుతున్నారు. టైప్-1, టైప్-2 ఏదైనా రెండింటి వల్ల రక్తంలో ఉన్న షుగర్ స్థాయిలు పెరుగుతాయి. అయితే ఈ రెండింటికీ ట్రీట్‌మెంట్లు కొద్దిగా వేరేగా ఉంటాయి. టైప్-1 కు ఇంజెక్షన్లు ఇస్తే, టైప్-2కు టాబ్లెట్లు ఇస్తారు. ఈ క్రమంలో ఏ తరహా షుగర్ వ్యాధి వచ్చినా దానికి వైద్యులు ఇచ్చే మందులతోపాటు పలు సూచనలు పాటిస్తే దాంతో షుగర్ గణనీయంగా అదుపులోకి వస్తుంది. షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నవారు డాక్టర్లు ఇచ్చే మందులను వాడడంతోపాటు పలు సూచనలు పాటిస్తే షుగర్ ను ఎల్లప్పుడూ నియంత్రణలో ఉంచుకోవచ్చు. దీని వల్ల దయాబెటిస్ ఇబ్బంది పెట్టదు.

**దాల్చిన చెక్క, వెల్లుల్లి..**

దాల్చిన చెక్కకు రక్తంలోని చక్కెరను అదుపు చేసే గుణం ఉంది. ఇందులో ఇన్సులిన్ తరహా ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తాయి. అయితే దాల్చిన చెక్కను ఎలా వాడాలంటే.. దీనికి చెందిన పొడిని 3 టేబుల్ స్పూన్ల మోతాదులో తీసుకుని ఒక లీటర్ నీటిలో వేసి మరిగించాలి. 20 నిమిషాల పాటు ఆ నీరు బాగా మరిగాక వచ్చే ద్రవాన్ని వడకట్టి రోజూ ఉదయం, సాయంత్రం భోజనానికి అరగంట ముందు తాగాలి. దీంతో కేవలం కొద్ది రోజుల్లోనే షుగర్ వ్యాధి అదుపులోకి వస్తుంది. అలాగే వెల్లుల్లిలో అలియం సాటివం అనే ఓ రకమైన రసాయనం సమృద్ధిగా ఉంటుంది. ఇది టైప్-2 దయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు మంచిది. ఇది వారి రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను అదుపు చేస్తుంది. నిత్యం ఉదయాన్నే పరగడుపున రెండు వెల్లుల్లి రెబ్బల్ని అలాగే పచ్చిగా తింటుంటే దాంతో షుగర్ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. దయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**కరివేపాకులు, జామ ఆకులు..**

రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించే గుణాలు కరివేపాకులోనూ ఉన్నాయి. వీటిలోని ఔషధ కారకాలు దయాబెటిస్‌ను అదుపు చేస్తాయి. నిత్యం ఉదయం, సాయంత్రం భోజనానికి అరగంట ముందుగా గుప్పెడు కరివేపాకు ఆకులను తింటుంటే దాంతో చక్కెర వ్యాధి నయం అవుతుంది. అదేవిధంగా జామ ఆకులు కొన్నింటిని తీసుకుని నీడలో ఎండబెట్టి పొడి చేసుకోవాలి. దీనికి 3 గ్రాముల జీలకర్ర పొడి కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక గ్లాస్ నీటిలో కలిపి ఆ నీటిని మరిగించాలి. అనంతరం ఆ నీరు అరగ్లాస్ అయ్యాక స్టవ్ ఆర్పి ద్రవాన్ని వడకట్టి తాగేయాలి. ఇలా చేస్తే షుగర్ వెంటనే అదుపులోకి వస్తుంది. అలాగే ఉదయాన్నే పరగడుపున 8 గ్లాసుల నీటిని తాగి గంట పాటు వాకింగ్ చేయాలి. ఇలా చేసినా షుగర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

**ఇతర చిట్కాలు..**

ఇక బీట్‌రూట్ దుంప, మెంతి ఆకు లేదా మెంతుల పొడి, కలబంద, వేప, తులసి వంటి మొక్కల ఆకులను ఉదయం, సాయంత్రం తింటున్నా షుగర్ వ్యాధిని అదుపులోకి తేవచ్చు. అలాగే పొడపత్రి ఆకు చూర్ణం నిత్యం ఉదయం, సాయంత్రం భోజనానికి అర గంట ముందు నీళ్లలో కలిపి తాగాలి. దీని వల్ల కూడా షుగర్ గణనీయంగా అదుపులోకి వస్తుంది. ఇలా ఆయా చిట్కాలు, సూచనలను పాటిస్తుంటే షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. దయాబెటిస్‌ను అదుపు చేయవచ్చు. ఆరోగ్యంగా జీవించవచ్చు.

# తెల్ల ఆవాలు కూడా ఉంటాయని మీకు తెలుసా..?

## వీటితో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?



రోజూ వంట చేసేందుకు అనేక రకాల పోపు దినుసులను వాడుతుంటారు. కూరల్లో వీటిని ఎక్కువగా వేస్తుంటారు. వాటిల్లో ఆవాలు కూడా ఒకటి. ఆవాలు అంటే సాధారణంగా అవి నల్లగా ఉంటాయి. కానీ మీకు తెలుసా..? వీటిల్లోనూ అనేక రకాలు ఉన్నాయి. అయితే మనకు మార్కెట్‌లో లభించే ఆవాలలో నలుపుతోపాటు తెలుపు రంగులోవి కూడా ఉంటాయి. ఇవి మరీ తెల్లగా ఉండవు, కాస్త క్రీమ్ కలర్‌లో ఉంటాయి. అయినప్పటికీ వీటిని తెల్ల ఆవాలు అనే పిలుస్తారు. అయితే నల్ల ఆవాలతోపాటు తెల్ల ఆవాలలోనే అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. తెల్ల ఆవాలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. ఇవి పోషకాలను అందించడమే కాక, వ్యాధులను నయం చేసేందుకు కూడా సహాయం చేస్తాయి.

**జీర్ణ వ్యవస్థకు..**

తెల్ల ఆవాలను ఆహారంలో భాగం చేసుకుంటో నోట్లో ఉమ్మి ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అలాగే జీర్ణ రసాలు కూడా ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల మనం తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. ముఖ్యంగా ఆహారంలో ఉండే ప్రోటీన్లు, కొవ్వులు సులభంగా జీర్ణం అవుతాయి. తెల్ల ఆవాలను తినడం వల్ల ఆకలి పెరుగుతుంది. ఆకలి లేని వారు వీటిని తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. సాధారణంగా జ్వరం లేదా ఏదైనా వ్యాధి వచ్చిన కోలుకున్న వారికి ఆహారం తినాలనిపించదు. నోరంతా చేదుగా ఉంటుంది. కానీ తెల్ల ఆవాలను తినడం వల్ల ఈ సమస్య తగ్గుతుంది. అలాగే ఇవి ఫైబర్‌ను అధికంగా కలిగి ఉంటాయి. కనుక వీటిని తింటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది.

**షుగర్ ఉన్నవారికి..**


తెల్ల ఆవాలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అనేక ఫినోలిక్ సమ్మేళనాలు, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. కనుక తెల్ల ఆవాలను తింటుంటే ఆక్సీకరణ ఒత్తిడి, వాపులు తగ్గుతాయి. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. వీటిని తినడం వల్ల అనేక రకాల మినరల్స్ మన శరీరానికి లభిస్తాయి. తెల్ల ఆవాల్లో సెలీనియం అధికంగా ఉంటుంది. ఇది థైరాయిడ్ గ్రంథి పనితీరును మెరుగు పరుస్తుంది. అలాగే వీటిల్లో ఉండే మెగ్నిషియం నాడీ మండల వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. రాత్రి పూట నిద్రలో కాలి పిక్కలు పట్టుకుపోవడం తగ్గుతుంది. షుగర్ లెవల్స్ ను నియంత్రించడంలోనూ మెగ్నిషియం సహాయం చేస్తుంది. కనుక దయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు తరచూ వీటిని తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**ఎముకల దృఢత్వానికి..**

తెల్ల ఆవాలలో క్యాల్షియం కూడా అధిక మొత్తంలో ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. కనుక వీటిని వాడితే కండరాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే కీళ్ల నొప్పుల నుంచి బయట పడవచ్చు. నొప్పులు, వాపులు తగ్గుతాయి. ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తెల్ల ఆవాలను ఉపయోగించడం వల్ల ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. అలాగే వీటిల్లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి కనుక ఇవి సహజసిద్ధమైన యాంటీ బయోటిక్‌గా పనిచేస్తాయి. వీటి వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. ఇలా తెల్ల ఆవాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడిలా చేసి రోజూ ఆహారంలో కాస్త తీసుకోవచ్చు. దీంతో అనేక లాభాలను పొందవచ్చు.

# కళ్లు పొడిబారుతూ ఇబ్బందులు పడుతున్నారా..?

# అయితే వీటిని ప్రయత్నించండి..!



ఒకప్పుడు ప్రజలు రోజూ శారీరక శ్రమ అధికంగా చేసేవారు. కానీ ఇప్పుడు చాలా మంది కంప్యూటర్ల ఎదుట గంటల తరబడి కూర్చుని పనిచేస్తున్నారు. అలాగే స్మార్ట్ ఫోన్లు, టీవీల వాడకం పెరిగింది. దీంతో కళ్లపై ప్రభావం పడుతోంది. ఫలితంగా కళ్లు పొడిబారడం, ఎర్రగా మారి దురద పెట్టడం, కళ్లలో మంటలు వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. అలాగే పోషకాహార లోపం కూడా చాలా మందిలో ఉంటోంది. దీని కారణంగా కంటి చూపు కూడా మందగిస్తోంది. దీంతో చిన్నారులు ఆ వయస్సు నుంచే కళ్లద్దాలను వాడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే కళ్లు పొడిబారడం అంటే కళ్లలో ఉండే తేమ తగ్గిపోవడం అని చెప్పవచ్చు. మన కళ్లను ఎప్పుడూ తేమగా ఉంచేందుకు గాను కళ్లలో కొన్ని ద్రవాలు ఎల్లప్పుడూ స్రవించబడుతూ ఉంటాయి. అందుకనే కళ్లపై భారం పడకుండా ఉంటుంది.

**ఇతర సమస్యలు కూడా..**

అయితే డిజిటల్ తెరలను అధికంగా చూడడం వల్ల సాధారణంగా కళ్లను ఎక్కువ సేపు తెరిచి ఉంచుతారు. దీంతో కళ్లలో ఉండే ద్రవాలు త్వరగా తగ్గుతాయి. ఈ కారణంగా కళ్లు పొడిబారతాయి. అనంతరం కళ్లు ఎర్రగా మారి దురదలు పెడతాయి. అయితే కళ్లు పొడిబారేందుకు కేవలం డిజిటల్ తెరలు మాత్రమే కాకుండా పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. కళ్లకు సరైన రక్షణ లేకపోవడం, దుమ్ము, ధూళిలో ఎక్కువగా గడపడం వంటి కారణాల వల్ల కూడా కళ్లు పొడిగా మారుతాయి. అయితే కళ్లు పొడిబారే వారిలో కేవలం కళ్లు ఎర్రగా మారడం, దురద పెట్టడం మాత్రమే కాకుండా పలు ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొందరికి కళ్లు పొడిబారితే తలనొప్పి వస్తుంది. అలాగే కళ్లలో కూడా నొప్పిగా ఉంటుంది. కొందరికి కళ్లు మంటగా అనిపిస్తాయి. మసకగా కూడా కనిపిస్తాయి. అలాగే ఆందోళనగా కూడా ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని జాగ్రత్తలను పాటిస్తే ఈ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు. అలాగే కళ్లు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటాయి.

**ఆహారాలు..**

కళ్లు పొడిబారిపోయి చాలా ఇబ్బందిగా ఉంటే కళ్లపై ఆవిరి పట్టడం ద్వారా పొడిబారిన కళ్లు మళ్లీ సాధారణం అవుతాయి. దీంతో కళ్లలో ఉండే ఎరుపుదనం, దురదలు కూడా తగ్గుతాయి. అలాగే గోరు వెచ్చని నీళ్లను వాటర్ బ్యాగ్‌లో పోసి ఆ బ్యాగ్‌ను కళ్లపై ఉంచి మసాజ్ చేసినట్లు రాయాలి. దీంతో కూడా కళ్లు పొడిబారడం తగ్గుతుంది. అదేవిధంగా అవిసె గింజలు, సోయాబీన్, చియా విత్తనాలు, చేపలు, వాల్ నట్స్, కోడిగుడ్లను ఆహారంలో భాగం చేసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి కళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కనుక వీటిని తరచూ తింటుంటే కంటి సమస్యలు తగ్గుతాయి. కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. ఇక కంప్యూటర్ల ఎదుట ఎక్కువ సేపు కూర్చుని పనిచేసేవారు 20-20-20 రూల్‌ను పాటించాలి. అంటే.. 20 నిమిషాలకు ఒకసారి 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలో ఉండే వస్తువులను చూడాలి. దీంతో కళ్లపై భారం పడకుండా అడ్డుకోవచ్చు. కళ్లు పొడిబారకుండా ఉంటాయి.

**ఇలా చేయకూడదు..**

ప్రస్తుతం చాలా మంది స్మార్ట్ ఫోన్లను అధికంగా ఉపయోగిస్తున్నారు. అలాగే టీవీల్లో గంటల తరబడి ఓటీటీలను చూస్తూ అదే ప్రపంచంలో మునిగి తేలుతున్నారు. వాస్తవానికి ఇలా గంటల తరబడి డిజిటల్ తెరలను చూడడం కళ్లకు అసలు మంచిది కాదు. దీని వల్ల కళ్లలో ఉండే తేమ చాలా వరకు తగ్గిపోతుంది. ఫలితంగా కళ్లు పొడిబారడం ఎక్కువవుతుంది. అప్పుడది మరింత ఎక్కువ సమస్యను సృష్టిస్తుంది. ఇది దీర్ఘకాలంలో కళ్లపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కళ్ల పొరలు దెబ్బ తినేందుకు అవకాశాలు ఉంటాయి. కనుక వైద్యులు ఫోన్లు, కంప్యూటర్లు, టీవీలను ఎక్కువ సేపు చూడవద్దని చెబుతారు. అయితే ఇవి లేకుండా ఉండాలంటే ప్రస్తుతం అసాధ్యమనే చెప్పవచ్చు. కానీ వీలైనంత వరకు వీటికి దూరంగా ఉండే ప్రయత్నం చేయాలి. దీని వల్ల కళ్లు పొడిబారకుండా సురక్షితంగా ఉండవచ్చు.

# అధిక బరువు తగ్గాలని చూస్తున్నారా..?

# అయితే ఈ ఆయుర్వేద సూత్రాలను పాటించండి..!



అధిక బరువును తగ్గించుకోవడం చాలా కష్టంగా ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. అధిక బరువు చాలా సులభంగా పెరుగుతారు. కానీ బరువు తగ్గడం చాలా అవస్థగా అనిపిస్తుంది. బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. అయితే అధికంగా ఉన్న బరువును తగ్గించుకునేందుకు చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. రోజూ వ్యాయామం చేయడం, పౌష్టికాహారం తీసుకోవడం, వేళకు నిద్రించడం చేస్తారు. ఈ క్రమంలోనే సరైన జీవనశైలిని పాటిస్తేనే బరువును తగ్గించుకోవడం తేలికవుతుంది. అయితే బరువు తగ్గేందుకు పలు ఆయుర్వేద సూత్రాలు కూడా ఎంతో మేలు చేస్తాయి. వాటిని పాటించడం వల్ల కేవలం బరువు తగ్గడం మాత్రమే కాదు, ఇంకా అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

**కరక్కాయ పెచ్చులు..**

బరువు తగ్గాలని చూస్తున్న వారు ఆయుర్వేద ప్రకారం రోజూ ముల్లంగి రసాన్ని తాగుతుంటే ఎంతో ఫలితం ఉంటుంది. ముల్లంగి రసాన్ని పూటకు 3 టీస్పూన్ల చొప్పున రోజుకు 3 సార్లు తీసుకోవాలి. దీని వల్ల శరీరంలో కొవ్వు చేరకుండా ఉంటుంది. బరువు తగ్గేందుకు ఈ రసం సహాయం చేస్తుంది. అలాగే కరక్కాయ పెచ్చులను చూర్ణం చేయాలి. దాన్ని అర టీస్పూన్ మోతాదులో తీసుకుని అందులో అంతే మోతాదులో తేనె లేదా వేడి నీరు కలపాలి. ఈ మిశ్రమాన్ని రెండు పూటలా తీసుకోవాలి. ఇలా చేస్తున్నా కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. అదేవిధంగా రేగు చెట్టు ఆకులను చిన్న ముద్దగా చేసి ఉలవచారు లేదా శనగలతో చేసిన చారుతో కలిపి తీసుకోవాలి. ఇది కూడా ఫలితాన్ని ఇస్తుంది. అలాగే ప్రతి రోజూ ఉదయం పరగడుపునే ఒక తమలపాకులో 5 మిరియాల గింజలను చుట్టి తిని వెంటనే ఒక గ్లాసు నీటిని తాగాలి. ఈ చిట్కా కూడా బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**తేనె..**

ఆముదం ఆకులను కాల్చి బూడిద చేసి నిల్వ చేసుకోవాలి. ఆ మిశ్రమాన్ని చిటికెడు చొప్పున తీసుకుని అందులో చిటికెడు ఇంగువ పొడిని కలిపి రెండు పూటలా బియ్యం కడిగిన నీళ్లతో కలిపి తీసుకోవాలి. అలాగే అర టీ స్పూన్ వాయు విడంగాల చూర్ణాన్ని తేనెతో కలిపి రెండు పూటలా తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇక బరువు తగ్గేందుకు గాను పలు ఆయుర్వేద సూచనలను కూడా పాటించాల్సి ఉంటుంది. రోజూ ఆహారంలో అన్ని రుచులు కలిసిన పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. అన్ని రుచులు ఉన్న ఆహారాలను రోజూ తినాలి. వేపుళ్లకు బదులుగా సాధారణ కూరలను తినాలి. భోజనం చేసినప్పుడల్లా జీర్ణాశయంలో కొద్దిగా ఖాళీ ఉండేట్లు తినాలి. అవసరం అయితే తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు భోజనం చేయాలి. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**ఆయుర్వేద సూత్రాలు..**

బరువు తగ్గాలని చూస్తున్నవారు వ్యాయామానికి ముందు 2 టీస్పూన్ల తేనెను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగాలి. దీని వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గుతారు. అలాగే ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాలను రోజూ తీసుకోవాలి. ఓట్స్, బార్లీ, చిరుధాన్యాలు, ఏడాది పాతబడిన బియ్యం, బ్రౌన్ రైస్ వంటివి తింటుంటే ఫలితం ఉంటుంది. అదేవిధంగా ఎట్టి పరిస్థితిలోనూ చల్లని నీళ్లను తాగరాదు. గోరు వెచ్చని నీళ్లనే తాగాల్సి ఉంటుంది. అలాగే మరీ చల్లగా లేదా మరీ వేడిగా ఉండే నీళ్లను స్నానానికి ఉపయోగించకూడదు. దీని వల్ల బరువు తగ్గడం కష్టమవుతుంది. కేవలం గోరు వెచ్చని నీళ్లను మాత్రమే స్నానానికి వాడాలి. అలాగే ఆహారంలో పెరుగుకు బదులుగా పలుచని మజ్జిగను తీసుకుంటుంటే ఉపయోగం ఉంటుంది. ఇలా పలు చిట్కాలు, ఆయుర్వేద సూత్రాలను పాటిస్తే చాలా సులభంగా బరువు తగ్గవచ్చు.

# మెస్సీ ప్రతీ అడుగూ కొన్ని వందల కోట్లే..!

లియోనల్ మెస్సీ మన గడ్డ మీద అడుగుపెడుతున్నాడు అంటే ఫుట్ బాల్ అభిమానులంతా అతని ఆటను చూడొచ్చు అని ఆశపడ్డారు. ప్రపంచంలో అత్యధిక మంది వీక్షించే ఈ గేమ్‌లో గొట్ వస్తున్నాడు అంటే... కళ్ల ముందే మాయచేసే అతని పాదాల మాయాజాలాన్ని ప్రత్యక్షంగా చూడొచ్చని సగటు అభిమాని ఆశపడ్డాడు. హైదరాబాద్‌లో మెస్సీకి..తెలంగాణ సీఎంకు మ్యాచ్ ఉంటుందని కూడా ప్రచారం చేశారు. కానీ మెస్సీ మన హైదరాబాద్‌లోనే కాదు.. కోల్‌కతా, ముంబైలలో ఎక్కడా మ్యాచ్ ఆడలేదు. ఫుట్‌బాల్ అంటే పిచ్చి ఉన్న కోల్‌కతా ప్రేక్షకులైతే.. మైదానాన్ని ధ్వంసం చేసి పడేశారు. జనాలు అంత అశపడుతున్నా.. మెస్సీ ఎందుకు కాలు కదపలేదు. హైదరాబాద్‌లో అయినా కోల్‌కతానే కాదు.. ఇంకెక్కడా మెస్సీ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడడు. దీనికి కారణం ఈగో కాదు ..దీనికి అనేక ఆర్థిక లావాదేవిలు, స్పోర్ట్స్ మేనెజ్‌మెంట్, రిస్క్ అసెస్‌మెంట్, ఇన్సూరెన్స్ ఇలా చాలా కారణాలున్నాయి. మెస్సీ అనే వ్యక్తి కేవలం ఓ ఫుట్ బాలర్ కాదు. అతను వేల కోట్ల రూపాయల అసెట్. అతని ప్రతీ అడుగూ కొన్ని వందల కోట్లతో ముడిపడి ఉంటుంది. అతను మాట్లాడినా.. కాలు కదిపినా లేదా కదపకపోయి నా.. చాలా "లెక్కలు" ఉంటాయి. ఖాళీగానే ఉన్నాడు కదా.. ట్రాక్ ప్యాంట్ ఎందుకు.. షార్ట్స్ వేసుకుని వచ్చేయొచ్చుగా అన్నట్లు ఉండదు. అవును.. .మీరు చదివింది నిజమే.. మెస్సీ పాదాల విలువ 1 బిలియన్ డాలర్.. అక్షరాలా 9వేల కోట్లు. అందులో ఎడమపాదానికే 7వేల కోట్ల ఇన్సూరెన్స్ ఉందని అంచనా. మెస్సీ కాళ్లు సాధారణ కాళ్లు కావు. అంతర్జాతీయ స్పోర్ట్స్ ఇన్సూరెన్స్ అంచనాల ప్రకారం, అతని కెరీర్‌లో వివిధ దశల్లో మెస్సీ కాళ్లకు సుమారు 700 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల వరకు ఇన్సూరెన్స్ ఉందని అంచనా. ఈ సంఖ్యలు అధికారికంగా బయటకు రావు. కానీ విలువ ఎంత భారీదో చెప్పడానికి ఇవే చాలు.అవును.. .మీరు చదివింది నిజమే.. మెస్సీ




పాదాల విలువ 1 బిలియన్ డాలర్.. అక్షరాలా 9వేల కోట్లు. అందులో ఎడమపాదానికే 7వేల కోట్ల ఇన్సూరెన్స్ ఉందని అంచనా. మెస్సీ కాళ్లు సాధారణ కాళ్లు కావు. అంతర్జాతీయ స్పోర్ట్స్ ఇన్సూరెన్స్ అంచనాల ప్రకారం, అతని కెరీర్‌లో వివిధ దశల్లో మెస్సీ కాళ్లకు సుమారు 700 మిలియన్ డాలర్ల నుంచి 1 బిలియన్ డాలర్ల వరకు ఇన్సూరెన్స్ ఉందని అంచనా. ఈ సంఖ్యలు అధికారికంగా బయటకు రావు. కానీ విలువ ఎంత భారీదో చెప్పడానికి ఇవే చాలు.ఇన్సూరెన్స్ ఉందికదా.. ఇక ఆడటానికి ఏమైంది అనుకోవచ్చు. ఈ బీమా అనేది అధికారిక మ్యాచ్‌లు, యూరో లీగ్ వంటి పెద్ద వాటికే కవర్ అవుతుంది. దేశాల మధ్య పోటీలు, ప్రతిష్టాత్మక లీగ్‌మ్యాచ్‌లకు ..వాటి ప్రాక్టీస్ సెషన్లు క్లబ్ అనుమతించిన ట్రైనింగ్ సెషన్లువంటి వాటికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. అయితే ఎగ్జిబిషన్, చారిటీ, ప్రమోషనల్ మ్యాచ్‌లు మాత్రం ఈ పరిధిలోకి ఆటోమేటిగ్‌గా వచ్చేయవు. ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను కవర్ చేయాలంటే క్లబ్, మెడికల్ టీమ్, ఇన్సూరెన్స్ కంపెనీ మూడు కలిసి ప్రత్యేక అనుమతి ఇవ్వాలి. అదనంగా కోట్లలో ప్రీమియం చెల్లించాలి. అంతా చేసినా రిస్క్ మాత్రం అలాగే ఉంటుంది. ఇలాంటి మ్యాచ్‌లతో గాయం అయితే కెరీర్ మొత్తం ఆగిపోతుంది. అది మెస్సీ ఒక్కడికే ఇబ్బంది కాదు. కొన్ని వేల కోట్ల రూపాయల వ్యాపారా సామ్రాజ్యం దెబ్బతింటుంది. అందుకే పెద్దగా ప్రయోజనం లేని ఎగ్జిబిషన్ చారిటీ మ్యాచ్‌ల కోసం క్లబ్‌లు మెస్సీ లాంటి ఆటగాడితో రిస్కులు చేయవ్.. కాబట్టి చాలా కఠినంగా ఈ మ్యాచ్‌లకు 'నో' చెబుతారు, మెస్సీ లాంటి ఆటగాడు.. వన్ టైమ్ వండర్ కాదు.. ఈ ఒక్కరోజుకే స్టార్ కాదు. అతనొక లాంగ్‌టర్మ్.. హై రిటర్న్ అసెట్. బిజినెస్ పరిభాషలో అతనొక ఆస్తి.. అతనే ఓ ఆర్థిక వ్యవస్థ. కాబట్టి అలాంటి వ్యవస్థను కాపాడేందుకు అన్ని ప్రయత్నాలూ జరుగుతాయి. ఇదంతా మనం షార్ట్స్ వేసుకుని.. బూట్లు తగిలించుకుని గ్రౌండ్‌లోకి దిగినంత ఈజీ కాదు.

## మెస్సీని కలిసిన జై షా

అర్జెంటినా ఫుట్‌బాస్ దిగ్గజం లియోనల్ మెస్సి గోట్ టూర్ ఆఫ్ ఇండియా పర్యటన ముగిసింది. సోమవారం ఢిల్లీ ఈవెంట్‌తో మెస్సి టూర్ కంప్లీట్ అయ్యింది. మూడు రోజులుగా భారత పర్యటనలో ఉన్న మెస్సి సోమవారం ఢిల్లీలో సందడి చేశాడు. ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెస్సి పాల్గొన్నాడు. ఈ సందర్భంగా మెస్సిని ఐసీసీ ఛైర్మన్ జై షా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, డీడీసీఏ అధ్యక్షుడు రోహన్ జైట్లీ కలిశారు.మెస్సికి జై షా స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. మెస్సికి భారత క్రికెట్ జట్టు జెర్సీ, బ్యాట్‌ను బహుకరించాడు. అలాగే మరో రెండు నెలల్లో ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్ మ్యాచ్ టికెట్ ఇచ్చారు. ఈ టోర్నీలో భారత్ తొలి మ్యాచ్‌లో USAను ఢీ కొట్టింది. ఫిబ్రవరి 7న వాంఖడే వేదికగా జరిగే ఈ మ్యాచ్‌ను చూసేందుకు రావాలని మెస్సిని జై షా కోరాడు. ఈ మేరకు మ్యాచ్‌కు సంబంధించిన టికెట్‌ను అతడికి అందించాడు. ఇక ఈ ఈవెంట్‌లో మెస్సి పిల్లలతో కలిసి కాసేపు ఫుట్‌బాల్ ఆడాడు. అతడిని చూసేందుకు వేలాది ప్రేక్షకులు వచ్చారు.ఈ సందర్భంగా మెస్సి స్టేడియంలోని ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపాడు. తాను మళ్లీ కచ్చితంగా భారత్‌కు వస్తానని చెప్పాడు. "భారత్‌లో గతకొన్ని రోజులుగా మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు. ఇది నాకు ఓ ప్రత్యేకమైన అనుభవం. ఇక్కన నేను ఉన్నది మూడు రోజులే. తక్కువ సమయంలోనే మీ నుంచి ఇంత ప్రేమ పొందడం చాలా అద్భుతంగా ఉంది. నాపై మీకు అభిమానం ఉంటుందని తెలుసు. కానీ ఇక్కడ ప్రత్యక్షంగా అనుభవించడం అద్భుతంగా ఉంది. మీ ప్రేమకు ధన్యవాదాలు. కచ్చితంగా ఏదో ఒక రోజు మళ్లీ భారత్‌కు వస్తాను. అందరికీ ధన్యవాదాలు" అని మెస్సి తెలిపాడు.

కాగా, ఈ టూర్‌లో మెస్సి తొలుత కోల్?కతా ఈవెంట్?లో పాల్గొన్నాడు. ఈనెల 13న భారత్‌కు వచ్చిన అతడు తొలుత కోల్?కతాలో పర్యటించాడు. అక్కడ తన 70 అడుగుల విగ్రహాన్ని వర్చువల్?గా ప్రారంభించాడు. అనంతరం వివేకానంద యువభారతి సాల్ట్ లేక్ స్టేడియంలో ఈవెంట్?లో పాల్గొన్నాడు. అయితే ఈ ఈవెంట్ ఫెయిల్ అయ్యింది! భద్రతా కారణాల వల్ల మెస్సి 20 నిమిషాల్లోనే మైదానం వీడాడు. దీంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ బాటిళ్లు, కుర్చీలు మైదానంలోకి విసిరేశారు. అలాగే భారీ సంఖ్యలో అభిమానులు గ్రౌండ్‌లోకి దూసుకొచ్చారు. దీంతో గందరగోళం పరిస్థితి ఏర్పడింది. అనంతరం ఈవెంట్ ఆర్గనైజర్ శతద్రు దత్తాను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేక్షకులకు టికెట్ డబ్బులు పూర్తిగా రిఫండ్ చేస్తామని ఆర్గనైజర్ ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. కోల్‌కతా తర్వాత అదే రోజు రాత్రి హైదరాబాద్‌లో పర్యటించాడు. ఇక్కడ ఉప్పల్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫ్రెండ్‌షిప్ మ్యాచ్ ఆడాడు. దాదాపు గంటసేపు స్టేడియంలో గడిపాడు. అనంతరం మెస్సిని సీఎం సత్కరించారు. ఇక్కడ్నుంచి మెస్సి ముంబయికి వెళ్లాడు. ఆదివారం ముంబయి వాంఖడేలో క్రికెట్ గాడ్ సచిన్ తెందుల్కర్‌తో కలిశాడు. మెస్సికి సచిన్ వరల్డ్‌కప్ జెర్సీ ఇవ్వగా, మెస్సి రిటర్న్‌లో సచిన్‌ను ఫుట్‌బాల్ ఇచ్చాడు.

# రిషబ్ పంత్ రికార్డ్ బ్రేక్ అవుతుందా..?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ మినీ వేలం క్రికెట్ అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ మినీ వేలం డిసెంబర్ 16వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో షురూ కానుంది. మొత్తం 10 జట్లు కలిపి రూ. 237.55 కోట్ల పర్స్ అందుబాటులో ఉండగా, సుమారు 350 మంది ఆటగాళ్లు వేలంలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. అయితే జట్లలో ఖాళీలు పరిమితంగా ఉండటంతో.. వీరిలో కేవలం 77 మంది ఆటగాళ్లకు మాత్రమే ఒప్పందాలు దక్కే అవకాశం ఉంది. ఈ మినీ వేలంలో బేస్ ధరల విషయంలోనూ ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. అత్యధికంగా 40 మంది ఆటగాళ్లకు రూ. 2 కోట్ల బేస్ ధర ఉండగా, అత్యల్పంగా 227 మంది ఆటగాళ్లకు రూ. 30 లక్షల బేస్ ధర నిర్ణయించారు. సాధారణంగా మినీ వేలంలో జట్లు కొద్దిమంది కీలక ఆటగాళ్లపై భారీ మొత్తాలు వెచ్చిస్తుంటాయి. ఇప్పటివరకు వేలం చరిత్రలో ఆరుగురు ఆటగాళ్లు రూ. 16 కోట్లకు పైగా ధరకు అమ్ముడుపోయారు. గత మెగా వేలంలో రిషబ్ పంత్ రూ. 27 కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేయడంతో చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. ఈ వేలాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్వహిస్తోంది. ఐపీఎల్ తో పాటు ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ను కూడా భారత క్రికెట్ నియంత్రణ మండలినే నిర్వహిస్తుంది. ఈసారి కూడా వేలం నిర్వాహకురాలిగా మల్లికా సాగర్ బాధ్యతలు చేపట్టనుంది. డిసెంబర్ 16న ఒకే రోజు ఈ మినీ వేలం పూర్తవుతుంది. ఐపీఎల్ లో ప్రతి మూడేండ్లకు ఓసారి మెగా వేలం జరుగుతుంది. ఆ సమయంలో జట్లు కేవలం ఆరుగురు ఆటగాళ్లను మాత్రమే నిలుపుకోగలవు. అయితే మెగా వేలాల మధ్యలో, జట్లకు అవసరమైన మార్పులు చేసుకునేందుకు మినీ వేలాలు నిర్వహిస్తారు. 2025 ఐపీఎల్ కోసం ఇప్పటికే మెగా వేలం పూర్తవడంతో, 2026, 2027 సీజన్ల కోసం ఈ మినీ వేలాలు నిర్వహిస్తున్నారు. ఈ వేలాల్లో తక్కువ మంది ఆటగాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు. కాబట్టి వీటిని మినీ వేలాలుగా పిలుస్తారు. ప్రపంచవ్యాప్తంగా 1,390 మంది ఆటగాళ్లు ఈ వేలానికి నమోదు చేసుకున్నప్పటికీ.. జట్ల ఆసక్తిని బట్టి 350 మంది ఆటగాళ్లను మాత్రమే షార్ట్‌లిస్ట్ చేసింది. రేపటి వేలంలో ఈ ఆటగాళ్లకే అవకాశం లభించనుంది. జట్లలో ఖాళీల విషయానికి వస్తే, కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా 13 ఖాళీలు ఉన్నాయి. వారు ఇప్పటివరకు కేవలం 12 మంది ఆటగాళ్లను మాత్రమే నిలుపుకున్నారు. పంజాబ్ కింగ్స్ వద్ద మాత్రం కేవలం నాలుగు ఖాళీలే ఉన్నాయి. ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ వద్ద ఐదు ఖాళీలు ఉన్నాయి. ఒక జట్టులో గరిష్టంగా 25 మంది ఆటగాళ్లు ఉండే అవకాశం ఉంది. పర్స్ పరంగా చూసినట్లయితే.. కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద రూ. 64.30 కోట్లతో అత్యధిక మొత్తం అందుబాటులో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ వద్ద రూ. 43.40 కోట్లు ఉన్నాయి. ముంబై ఇండియన్స్ వద్ద మాత్రం కేవలం రూ. 2.75 కోట్ల పర్స్ మాత్రమే మిగిలి ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు రూ. 21 నుంచి రూ. 26 కోట్ల మధ్య పర్స్ కలిగి ఉన్నాయి. పది జట్లు ఇప్పటివరకు 173 మంది ఆటగాళ్లను నిలుపుకున్నాయి. వీరిలో 45 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తం 250 మంది ఆటగాళ్లను జట్లు కలిగి ఉండే అవకాశం ఉంది. అందులో 80 మంది విదేశీయులు ఉండాలి. అంటే ఈ మినీ వేలంలో 77 స్లాట్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో 25 విదేశీ ఆటగాళ్లకు, 52 భారతీయ ఆటగాళ్లకు అవకాశం ఉంటుంది. వేలానికి ముందు ట్రేడింగ్ విండోలో ఎనిమిది మంది ఆటగాళ్లు జట్ల మధ్య ఎక్స్ఛేంజ్ అవుతుంటారు. సంజు సామ్సన్ రాజస్థాన్ నుంచి చెన్నైకి, రవీంద్ర జడేజా చెన్నై నుంచి రాజస్థాన్‌కు, మహమ్మద్ షమీ హైదరాబాద్ నుంచి లక్నోకు మారడం ఈ ట్రేడ్లలో ముఖ్యమైనవిగా ఉన్నాయి. మినీ వేలంలో ఆటగాళ్ల నిలుపుదలపై లిమిట్ లేదు. జట్లు కావాలంటే తమ మొత్తం జట్టును నిలుపుకోవచ్చు. బేస్ ధరలు రూ. 30 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు ఉంటాయి. వేలం అంతర్జాతీయ ఆటగాళ్లతో ప్రారంభమవుతుంది. మొదట బ్యాట్స్‌మెన్, ఆల్‌రౌండర్లు, వికెట్‌కీపర్లు, బౌలర్లు అనే క్రమంలో పేర్లు వస్తాయి. ఆ తర్వాత అన్‌క్యాప్డ్ ఆటగాళ్ల వేలం జరుగుతుంది. చివర్లో యాక్సిలరేటెడ్ రౌండ్ ద్వారా మిగిలిన ఖాళీలను భర్తీ చేస్తారు. మొత్తానికి.. 19వ సీజన్ మినీ వేలం జట్ల వ్యూహాలు, యువ ఆటగాళ్ల భవితవ్యాలు.. అలాగే భారీ బిడ్డింగ్‌లతో మరోసారి క్రికెట్ ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. ఈసారి రిషబ్ పంత్ రికార్డును ఎవరు బ్రేక్ చేస్తారో చూడాల్సిందే.




## సూర్య, గిల్ చెలరేగుతారు.. నాది గ్యారంటీ

### విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ



పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ అండగా నిలిచాడు. ఈ ఇద్దరూ ప్రపంచకప్‌లో చెలరేగుతారని, తనది గ్యారంటీ అని చెప్పుకొచ్చాడు.సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మూడు మ్యాచ్‌ల్లో సూర్య, గిల్ దారుణంగా విఫలమయ్యారు. సూర్య వరుసగా 12 (11), 5 (4), 12 (11) పరుగులు చేస్తే.. శుభ్‌మన్ గిల్, 4, 0, 28 పరుగులే చేసి నిరాశపర్చాడు. ఈ ఏడాది సూర్య 213 పరుగులు చేయగా.. శుభ్‌మన్ గిల్ 293 పరుగులే చేశాడు. టీ20 ప్రపంచకప్ ముందు ఈ ఇద్దరూ స్టార్ ఆటగాళ్ల పేలవ ఫామ్ ఆందోళనకు గురి చేస్తోంది.ఈ క్రమంలోనే ఈ ఇద్దరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తుది జట్టులో నుంచి తప్పించాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతోంది. సౌతాఫ్రికాతో మూడో టీ20 విజయానంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న అభిషేక్ శర్మ.. తమ కెప్టెన్, వైస్ కెప్టెన్‌కు అండగా నిలిచాడు. 'టీ20 ప్రపంచకప్‌లో సూర్య, శుభ్‌మన్ గిల్.. భారత్‌ను గెలిపిస్తారు. ఇందుకు నాది గ్యారెంటీ. ప్రపంచకప్‌కు ముందు కూడా కీలక ఇన్నింగ్స్ ఆడతారు. శుభ్‌మన్‌తో చాలా కాలంగా కలిసి ఆడుతున్నాను. అతను ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించగలడు. గిల్ గురించి నాకు బాగా తెలుసు. అతనిపై నాకు పూర్తి నమ్మకం ఉంది. త్వరలో అందరికీ అతనిపై నమ్మకం కలుగుతోంది. సూర్య కూడా పరుగులు చేస్తాడు.'అని అభిషేక్ శర్మ చెప్పుకొచ్చాడు.మరోవైపు తన ఫేలవ బ్యాటింగ్‌పై స్పందించిన సూర్య.. తాను ఫామ్‌లోనే ఉన్నానని స్పష్టం చేశాడు. 'ఫామ్‌లో లేను అనే మాటను నేను అంగీకరించను. నెట్స్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నా. పరుగులు ఎప్పుడు రావాలో అప్పుడు కచ్చితంగా వస్తాయి.'అని తెలిపాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 117 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్(46 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు. మిగతా బ్యాటర్లలో డోనవన్ ఫెర్రెయిరా(15 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 20), అన్రిచ్ నోర్జ్(12) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(3/25), హర్షిత్ రాణా(2/34), వరుణ్ చక్రవర్తి(2/11), కుల్దీప్ యాదవ్(2/12) రెండేసి వికెట్లతో సత్తా చాటగా.. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలకు చెరో వికెట్ దక్కింది.అనంతరం భారత్ 15.5 ఓవర్లలో 3 వికెట్లకు 120 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. అభిషేక్ శర్మ(18 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 35) తన జోరు కొనసాగించగా.. శుభ్‌మన్ గిల్(28 బంతుల్లో 5 ఫోర్లతో 28), సూర్యకుమార్ యాదవ్(11 బంతుల్లో 2 ఫోర్లతో 12) మరోసారి తడబడ్డారు. తిలక్ వర్మ(34 బంతుల్లో 3 ఫోర్లతో 26 నాటౌట్), శివమ్ దూబే(4 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 10 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశారు.

## షాహీన్ ఆఫ్రీదిపై సస్పెన్షన్

పాకిస్థాన్ ప్రీమియం బౌలర్‌గా చెప్పుకునే షాహీన్ షా అఫ్రిదికి ఘోర అవమానం ఎదురైంది. నిబంధనలకు విరుద్ధంగా బౌలింగ్ చేయడంతో ఫీల్డ్ అంపైర్ అతని బౌలింగ్‌ను రద్దు చేశాడు. ఓవర్ మధ్యలోనే అతనిపై సస్పెన్షన్ విధిస్తూ ఈ చర్యలు తీసుకున్నాడు. ఈ ఘటన ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లో చోటు చేసుకుంది. ఈ అనూహ్య సంఘటనతో అఫ్రిది అవాక్కయ్యాడు. బీబీఎల్‌లో షాహీన్ షా అఫ్రిదికి ఇది అరంగేట్ర మ్యాచ్ కావడం కొసమెరుపు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. బిగ్ బాష్ లీగ్‌లో బ్రిస్బేన్ హీట్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న షాహీన్ షా అఫ్రిది.. మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌తో సోమవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో రెండు బీమర్స్ వేసి సస్పెన్షన్‌కు గురయ్యాడు. మెల్‌బోర్న్ ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ మూడో బంతిని హైఫుల్ టాస్‌గా వేయగా.. హెల్మెట్‌కు తాకింది. అంపైర్ నోబాల్ ఇవ్వడంతో తొలి బీమర్‌గా వార్నింగ్ ఇచ్చాడు. నాలుగో బంతిని మరోసారి ఔట్ సైడ్ ఆఫ్ దిశగా ఫుల్‌టాస్ వేసాడు. ఈ బంతిని కూడా అంపైర్ వైడ్‌గా ప్రకటించాడు. ఇక ఐదో బంతిని మరోసారి బీమర్ వేయడంతో అంపైర్ నోబాల్ ఇచ్చి బౌలర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించాడు. ఐసీసీ రూల్స్ ప్రకారం ఒకే ఓవర్‌లో రెండు బీమర్స్ వేస్తే బౌలర్‌ను మ్యాచ్ మొత్తం మళ్లీ బౌలింగ్ చేయకుండా సస్పెండ్ విధిస్తారు. షాహిన్ అఫ్రిది విషయంలోనూ ఈ చర్యలే తీసుకున్నారు. మ్యాచ్ రిఫరీ షాహీన్ అఫ్రిదిపై కఠిన చర్యలు తీసుకునే ఛాన్స్ ఉంది. అతని మ్యాచ్ ఫీజులో కోత విధించే అవకాశం కూడా ఉంది.




షాహీన్ అఫ్రిది బౌలింగ్‌ను మెక్స్వీనీ పూర్తి చేశాడు. ఈ మ్యాచ్‌లో 2.4 ఓవర్లు వేసిన షాహిన్ షా అఫ్రిది.. 43 పరుగులు సమర్పించుకున్నాడు. ఇందులో 4 ఫోర్లతో పాటు 2 సిక్స్‌లు, 2 వైడ్స్, 3 నోబాల్స్ ఉన్నాయి. బీబీఎల్ అరంగేట్రంలోనే సస్పెన్షన్‌కు గురైన షాహిన్ షా అఫ్రిదిపై సోషల్ మీడియా వేదికగా జోకులు, మీమ్స్ పేలుతున్నాయి. పాపం.. పాక్ ప్రీమియర్ బౌలర్‌కు ఎంత గతిపట్టే అని వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన మెల్‌బోర్న్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 212 పరుగుల భారీ స్కోర్ చేసింది. టీమ్ సీఫెర్ట్(56 బంతుల్లో 9 ఫోర్లు, 6 సిక్స్‌లతో 102) సెంచరీతో చెలరేగగా.. ఓలివర్ పీక్(57) హాఫ్ సెంచరీతో రాణించాడు.

నేటి సాక్షి
కరీంనగర్ | మంగళవారం 16 డిసెంబర్ 2025

# చీరకట్టులో అనసూయ రాజసం..
# గ్లామర్ కవ్వింతలు!

బుల్లితెర నుంచి వెండితెరకు వచ్చి సక్సెస్ అయిన వారిలో అనసూయ భరద్వాజ్ టాప్ లిస్ట్ లో ఉంటారు. యాంకర్గా తన ప్రయాణం మొదలుపెట్టినా, ఇప్పుడు స్టార్ నటిగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. ఒకవైపు సినిమాలు, మరోవైపు షోలతో బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తన గ్లామర్తో ఎప్పుడూ ట్రెండింగ్లో ఉండటం ఈ బ్యూటీ స్పెషాలిటీ. తనదైన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులలో చెరగని ముద్ర వేసుకున్నారు. లేటెస్ట్ గా అనసూయ తన ఇన్స్టాగ్రామ్లో షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట సెగలు రేపుతున్నాయి. మెటాలిక్ బ్లూ, గోల్డ్ కలర్ కాంబినేషన్ ఉన్న పట్టుచీరలో ఆమె రాజసం ఉట్టిపడేలా కనిపిస్తున్నారు. దీనికి మ్యాచింగ్గా స్లీవ్లెస్ డిజైనర్ బౌజ్ ధరించి, ట్రెడిషనల్ చీరకట్టులోనూ గ్లామర్ డోస్ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ఆమె లుక్ చూస్తుంటే క్లాసీగా ఉంటూనే ఎంతో గ్లామర్ గా, స్టైలిష్గా అనిపిస్తోంది. ఈ ఫొటోషూట్లో హైలెట్ ఆమె హెయిర్ స్టైల్ అనే చెప్పాలి. ఉంగరాల జుట్టును గాలికి వదిలేసి, ఆ కురుల మాటున ఆమె ఇస్తున్న ఎక్స్ప్రెషన్స్ కుర్రాళ్ళను కట్టిపడేస్తున్నాయి. భారీ ఆభరణాల జోలికి వెళ్లకుండా, కేవలం పెద్ద డిజైనర్ చెవిపోగులు, చేతికి నల్లటి గాజులు ధరించి సింపుల్గా మెరిసిపోయారు. హిందీ పాట లిరిక్స్ను క్యాప్షన్గా పెడుతూ, తనలోని లవ్లీ యాంగిల్ను బయటపెట్టారు. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనలోనూ తనకు తానే సాటి అని అనసూయ ఎప్పుడో నిరూపించుకున్నారు. 'రంగస్థలం'లో రంగమ్మత్తగా, 'పుష్ప'లో దాక్షాయణిగా ఆమె చేసిన పాత్రలు అంత సులభంగా మర్చిపోలేం. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ, స్టార్ హీరోల సినిమాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నారు. లేడీ ఓరియెంటెడ్ కథలను కూడా ఎంచుకుంటూ నటిగా తన పరిధిని రోజురోజుకూ పెంచుకుంటున్నారు. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో ఫుల్ బిజీగా గడుపుతున్నారు. సినిమా షూటింగ్లతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం అనసూయ ఎప్పుడూ యాక్టివ్గా ఉంటారు. అప్పుడప్పుడు వెస్ట్రన్ వేర్లో షాక్ ఇస్తూనే, ఇలాంటి చీరకట్టులో అచ్చమైన తెలుగుదనాన్ని చూపిస్తూ ఫ్యాన్స్ను సర్ప్రైజ్ చేస్తుంటారు. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. వయసు పెరుగుతున్నా ఆమెలోని గ్లామర్, ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదని పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు.





# రూ.552 కోట్లు వసూలు చేసిన దురంధర్

కలెక్షన్స్ పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది బాలీవుడ్ మూవీ 'ధురంధర్'. డిసెంబరు 5న బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ సినిమా ఇప్పటి వరకూ రూ.552 కోట్లు వసూలు చేసింది. ఈ విజయంపై హీరో రణ్వీర్ సింగ్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. 'అదృష్టానికి మంచి అలవాటు ఉంది. సమయానికి తగ్గట్టు అది మారుతూ ఉంటుంది. కానీ, ఓర్పు చాలా ముఖ్యం' అని పేర్కొన్నారు. తన గత చిత్రాల ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలా రాసినట్టు అనిపిస్తోంది. 2025లో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో 'ధురంధర్'ది ప్రస్తుతానికి నాలుగో స్థానం. 'కాంతార: చాప్టర్ 1' తొలి స్థానంలో, 'ఛావా' ద్వితీయ స్థానంలో, 'సైయారా' తృతీయ స్థానంలో ఉన్నాయి. వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీ సినీ ప్రముఖులనూ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సినిమాని మెచ్చిన వారిలో అల్లు అర్జున్ ఒకరు. నిడివి ఎక్కువైనా కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని ఈ సినిమా మూడున్నర గంటలతో మరోసారి రుజువైంది. హీరో రణ్వీర్తోపాటు కీలక పాత్ర పోషించిన అక్షయ్ ఖన్నాకు ఈ సినిమాతో మరింత పేరొచ్చింది. ఈ సినిమాలో ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్గా నటించిన మాధవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ధురంధర్' ట్రైలర్లాంటిదని, అసలు సినిమా 'ధురంధర్ 2' అంటూ అభిమానుల్లో అంచనాలు పెంచారు. సీక్వెల్లో రణ్వీర్ నటన మరో స్థాయిలో ఉంటుందన్నారు. పార్ట్ 1తో పోలిస్తే పార్ట్ 2లో తన పాత్రకు స్కోప్ ఎక్కువ అని మాధవన్ తెలిపారు. 2026 మార్చి 19న 'ధురంధర్ 2' విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.



# ఫీమేల్ సెంట్రిక్ రోల్‌లో భాగ్యశ్రీ

మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఆంధ్ర కింగ్ తాలూకా, కాంతా సినిమాలలో కూడా మెరిసింది. కెరీర్లో అతితక్కువ సమయంలోనే క్రేజీ ఆఫర్ కొట్టేసింది. తాజా టాక్ ప్రకారం భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ సెంట్రిక్ సినిమాను లైన్లో పెట్టిందట. అంతేకాదు వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ స్వప్నాదత్, ప్రియాంకా దత్ స్వప్నా సినిమా బ్యానర్‌పై ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటుంది ఈ బ్యానర్. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పవర్ ఫుల్ ఉమెన్ సెంట్రిక్ స్టబెక్టుతో స్క్రిప్ట్ రెడీ చేశాడట రమేశ్. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్ లో మెరిసిన భాగ్యశ్రీని ఇక నటనకు ఆస్కారమున్న పాత్రలో చూపించబోతున్నాడట డైరెక్టర్. మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌కు చెందిన ఈ భామ హిందీ ప్రాజెక్టులు యారియాన్, చందూ చాంపియన్‌లో కామియో రోల్స్ లో నటించింది. మిస్టర్ బచ్చన్ సినిమాకు గాను బెస్ట్ ఫీ మేల్ డెబ్యూ ఫర్ తెలుగు అవార్డు అందుకుంది. మరి తాజాగా చేస్తున్న లేడీ ఓరియెంటెడ్ సినిమా భాగ్యశ్రీలోని నయా యాంగిల్‌ను చూపించడం ఖాయమైనట్టేనని ఈ వార్త క్లారిటీ ఇచ్చేస్తుది. మరి భాగ్యశ్రీ ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



# బాలీవుడ్ వైపు 'కాంతారా.. కాంత' చూపు

కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. కాంతార చాప్టర్ 1 చిత్రంలో యువరాణి కనకవతి అనే ప్రతినాయిక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రుక్మిణి, తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నట్లు వెల్లడించింది.తెలుగు, కన్నడ చిత్రసీమలకు ఇప్పటికే పరిచయమైన ఈ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళ చిత్రాల్లోనూ క్రేజీ ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్‌పై తన ఆసక్తిని బహిరంగంగానే వ్యక్తం చేసిన రుక్మిణి, హిందీ భాషతో తనకున్న అనుబంధమే అక్కడ నటించాలనే తపనకు కారణమని చెప్పింది. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'హిందీ నాకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉన్న భాష. మా కుటుంబానికి సైనిక నేపథ్యం ఉ ఒడటంతో, వివిధ కంటోన్మెంట్ల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉండేది. అందుకే ఆ భాషపై నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటివరకు హిందీలో నటించే అవకాశం రాలేదు. కానీ, ఆ భాషలో నా ప్రతిభను నిరూపించుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాను. దేవుడి దయతో త్వరలోనే ఆ ప్రయాణం ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపింది.రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కాంతార చాప్టర్ 1 విడుదలై సంచలన విజయం సాధించగా, ఇందులో రుక్మిణి వసంత్ ప్రతినాయిక పాత్రలో కనిపించి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమె అందచందాలు, నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రస్తుతం ఈ సినిమా విజయం ఇచ్చిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని చెప్పిన రుక్మిణి, త్వరలో కాంతార టీమ్ అంతా కలిసి విజయోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడించింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార్ఖండ్ సహా దేశం నలుమూలల నుంచి వస్తున్న స్పందనలు తనను ఎంతో ఉత్సాహపరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు దక్షిణాది భాషల్లోనూ రుక్మిణి వసంత్ కెరీర్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

# సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన అవసరం





- **అపోలో వర్శిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చిత్తూరు, డిసెంబర్ 15: ది అపోలో యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సోమవారం "సైబర్ సెక్యూరిటీ & ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్" అనే హాట్ టాపిక్‌పై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడలోని నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్, అదనపు రాష్ట్ర ఇన్ఫర్మాటిక్స్ అధికారి ఎస్. మధుసూధనరావు రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని, సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యత, ఏఐ ఆధారిత టెక్నాలజీల వినియోగం, సైబర్ నేరాల స్వరూపంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ, నేటి ప్రపంచంలో టెక్నాలజీ మన జీవితంలో విడదీయరాని భాగంగా మారిందన్నారు. అయితే అదే టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ స్కామ్స్ రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్నాయని, ప్రతిరోజూ వందలు, వేల సంఖ్యలో అమాయకులు మోసపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా టెక్నాలజీపై అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భారత్‌లో సైబర్ నేరాల ప్రభావం మరింత ఎక్కువగా ఉందని, దీనిని ఎదుర్కొనేందుకు బలమైన అవగాహన వ్యవస్థ అవసరమని స్పష్టం చేశారు. విద్యాసంస్థలు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు సైబర్ భద్రతపై పూర్తి అవగాహన కలిగి సమాజానికి కూడా చైతన్యం కల్పించాలన్నారు. రిసోర్స్ పర్సన్ ఎస్. మధుసూధనరావు మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైబర్ సెక్యూరిటీలో ఎలా ఉపయోగపడుతోందో, హ్యాకింగ్, ఫిషింగ్, ఆన్‌లైన్ మోసాలు, డేటా దొంగతనం వంటి నేరాలను ఏఐ సహాయంతో ఎలా గుర్తించి నివారించవచ్చో వివరించారు. ప్రభుత్వ విభాగాల్లో అమలవుతున్న సైబర్ భద్రతా వ్యవస్థలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా స్పష్టమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. ఎం. పోతరాజు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొ. డి. జగదీశన్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అపోలోను సందర్శించిన అమెరికన్ సిటిజన్ సర్వీసెస్ ప్రతినిధులు అమెరికన్ సిటిజన్ సర్వీసెస్ (ఏసిఎస్) ప్రతినిధులు సోమవారం ది అపోలో యూనిర్శిటీని సందర్శించారు. అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, యూనిట్ హెడ్ ఎస్. బాలరాజ్ తదితర అధికారులతో వీరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అమెరికాలో విద్య, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సేవల వినియోగం, అంతర్జాతీయ ప్రయాణాల్లో భద్రత వంటి అంశాలపై చర్చించారు. భారత్‌లో యునైటెడ్ స్టేట్స్ పౌరుల హక్కులు, బాధ్యతలు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను వివరించారు. అమెరికా పౌరుల సేవల కోసం యుఎస్ కాన్సులేట్ జనరల్, హైదరాబాద్‌లో అందుబాటులో ఉందని ప్రతినిధులు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా రాష్ట్రాల్లో ఉన్న అమెరికా పౌరులకు అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే తమను సంప్రదించాలని సూచించారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి





- **నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీ ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్ పి లు**
- **హెల్మెట్ వాడకంతో రోడ్డు ప్రమాదాలలో మరణాల శాతం తగ్గించవచ్చు**
- **హెల్మెట్ ధారణ పై ప్రజలు స్వీయ భాధ్యత కలిగి ఉండాలి**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి :** హెల్మెట్ ధరించిన కారణంగా రోడ్డు ప్రమాదాల నుండి వాహనదారులు తమ ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉంటుందని, ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం తిరుపతి పట్టణంలోని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుండి సుమారు 700 మందితో ఏర్పాటు చేసిన నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడితో కలసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా సుమారు 500 మంది ద్విచక్ర వాహనదారులు మరణిస్తున్నారని, వీరిలో చాలా వరకు హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై మ-రణించారన్నారు. హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే వీరు ప్రాణాలతో ఉండే అవకాశం ఉండేదన్నారు. జిల్లా పోలీస్ శాఖ ద్వారా నో హెల్మెట్ – నో పెట్రోల్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా నేటి నుండి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్ లో హెల్మెట్ లేనిదే ద్విచక్ర వాహనాలకు ఇవ్వడం ఉండదని తెలిపారు. రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వాహనాలు నడిపే సమయంలో ద్విచక్ర వాహనదారులు భాధ్యతగా హెల్మెట్ ధరించాలని, వారు భాధ్యత విస్మరించినట్లైతే వారి ప్రాణాలు కాపాడుకోవడంలో భాగంగా ప్రభుత్వం నిర్భంద చర్యలు చేపట్టవలసి ఉంటుందన్నారు. తిరుపతి పట్టణం అభివృద్ధి శరవేగంగా జరుగుతున్నదని, ఇటువంటి పట్టణాలలో చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు రూపొందించుటకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. జిల్లా ఎస్ పి మాట్లాడుతూ హెల్మెట్ లేని కారణంగా రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు ఎక్కువ శాతం మరణిస్తున్నారని, హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకుని తమ కుటుంబాలతో సురక్షితంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించడం తమ ధ్యేయం కాదని, ప్రజల భద్రత తమ భాధ్యత అని అన్నారు. హెల్మెట్ ధరించడం పై అవగాహన కల్పించడంలో భాగంగా నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీ నిర్వహించడం జరుగిందన్నారు. ద్విచక్ర వాహనాదారులు చిన్న ఆక్సిడెంట్ ల కూడా తలకు బలమైన గాయాల కారణంగా మరణిస్తున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పక హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో ఏ ఎస్ పి లు రవి మనోహరాచారి, డి శ్రీనివాసరావు,నాగభూషణం, డీఎస్పీలు, సిఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ల అరికట్టడానికి చర్యలు తీసుకోవాలి

- **నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ల అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలి - లోక్‌సభలో ఎంపీ గురుమూర్తి**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) న్యూఢిల్లీ:** నకిలీ పాన్, ఆధార్ పత్రాలు ఉపయోగించి సృష్టిస్తున్న నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాదనం ఇచ్చారు. గత మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు వెలుగుచూశాయని, వీటి ద్వారా భారీగా పన్ను ఎగవేత జరిగిందని తన సమాధానంలో అంగీకరించారు. 2023-24లో 5,699 నకిలీ రిజిస్ట్రేషన్లు గుర్తించగా, దాదాపు రూ. 15,085 కోట్ల పన్ను నష్టం జరిగినట్లు తెలిపింది. 2024-25లో 3,977 కేసుల్లో రూ. 13,109 కోట్ల మేర పన్ను ఎగవేత జరిగినట్టు, 2025-26లో అక్టోబర్ వరకు 489 కేసుల్లో రూ. 3,013 కోట్ల నష్టం జరిగినట్టు వెల్లడించింది. నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు, ఫేక్ బిల్లింగ్, అనర్హ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దుర్వినియోగాన్ని అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక డ్రైవులు నిర్వహించినట్లు తెలిపారు. బయోమెట్రిక్ ఆధార్ ధృవీకరణ, రిస్క్ ఆధారిత పరిశీలన, వ్యాపార స్థలాల జియో ట్యాగింగ్, బ్యాంక్ ఖాతాల అనుసంధానం వంటి చర్యలు తీసుకున్నామని వివరించారు. అలాగే నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారి జీఎస్టీ రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేయడం, రద్దు చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో ఇప్పటివరకు 133 మందిని అరెస్ట్ చేసి, 94 కేసుల్లో అభియోగాలు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ, నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం జరుగుతోందని, నిజాయితీగా పన్నులు చెల్లించే వ్యాపారులపై భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి



మోసాలకు కఠిన శిక్షలు, వేగవంతమైన విచారణ, పన్ను నష్టం పూర్తిగా రికవరీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘనంగా యూత్ క్రిస్మస్ సంబరాలు

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** యూఏఈ దేశంలోని ఫెయిత్ ఫుల్ గాస్పల్ కరమ చర్చ్, కరామ లోని కెరీర బిల్డింగ్ నందు యూత్ క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బిషప్స్ డయాసిస్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్,సంఘ కాపరి పాస్టర్ యేసు అధ్యక్షత వహించగా ప్రోగ్రాం కోఆర్డినేటర్ నీల శామ్యూల్ రత్నం ఆహ్వానం పలికి కారు. ముఖ్య ప్రసంగీకులు ప్రవీణ్ మాట్లాడుతూ వృద్ధుడైనటువంటి పౌలు యవనస్తుడు అయినటువంటి తిమోతికి రాసిన లేఖలో మొదటి తిమోతి నాల్గవ అధ్యాయం 11-13 వచనాలలో చెప్పబడినట్లు " నీ యవ్వనమును బట్టి ఎవ్వడు నిన్ను తృణీకరింప నీయ కుగాని మాటలలోనూ, ప్రవర్తనలోనూ, ప్రేమలోనూ, విశ్వాసంలోనూ, పవిత్రుత లోనూ, విశ్వాసులకు మాదిరిగా ఉండుము". అన్నట్లు యవ్వనస్తులు అనగా యూత్ ఈ ఐదు విషయంలో క్రీస్తు పోలిన వారిగా ఉండవలెనని ఆకాంక్షించారు. మాటలు అవునంటే అవునని కాదంటే కాదని యు వలే ఉండవ నని, ప్రేమ విషయంలో నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అనగా నీవు ఏ మాటలు అంటే బాధపడతావో అటువంటి మాటలు ఎదుటివారిని అనురాధని, అందరిని ఒకే ప్రేమతో చూసుకోవాలి అన్నారు. అనంతరం యూత్ తో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు వాసు పొడిపి రెడ్డి,



మరియు పాస్టర్ సెల్వరాజ్ రావులపాలెం , ఓషియన్ స్టార్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లి శీను బాబు, బైకో కృష్ణారెడ్డి, ప్రమోద్ కుమార్, శ్రావణి శెట్టి తాళ్లూరు బ్రహ్మీ ,సిస్టర్ మేరీ జ్యోతి , తదితరులు పాల్గొన్నారు.

# మరికల్ గ్రామ సర్పంచ్ గా గుపా చెన్నయ్య



**నేటి సాక్షి నారాయణపేట డిసెంబర్ 15 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ గ్రామ నూతన సర్పంచిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గూప చెన్నయ్య విజయం సాధించారు. ఆయన తన సమీప బి ఆర్ ఎస్ అభ్యర్థి జోగు రామస్వామి పై 355 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గూప చెన్నయ్య కు 2,760 ఓట్లు రాగా అలాగే జోగు రామస్వామికి 2,405 ఓట్లు వచ్చాయి. అనంతరం బీజేపీ అభ్యర్థి సీమ శివకుమార్ కు 803 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ గోప చెన్నయ్య మాట్లాడుతూ నన్ను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞత తెలియజేశారు. అలాగే మరికల్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# గ్రామ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం

**గ్రామ సర్పంచ్ గాదం పెద్దపుల్లప్ప....**



**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 15 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని రా కొండ గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని రాకుండా గ్రామ సర్పంచ్ గాదం పెద్ద పుల్లప్ప అన్నారు. సోమవారం నాడు రా కొండ గ్రామంలోని దళిత వార్డు ను సందర్శించారు. ఈ సందర్భంగా రాకుండా గ్రామ సర్పంచ్ పెద్దపుల్లప్ప మాట్లాడుతూ దళిత వాడలో డ్రైనేజీ సిసి రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన గ్రామస్తులను కోరారు.

# తిలేరు గ్రామ సర్పంచ్ గా మురారి

**గ్రామ ఉప సర్పంచ్ గా జి అశోక్ కుమార్....**



**నేటి సాక్షి,నారాయణపేట, డిసెంబర్ 15 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని తిలేరు గ్రామ సర్పంచ్ గా మురారి గెలపొందడం జరిగింది. గ్రామ ఉపసర్పంచ్గా జి. అశోక్ కుమార్ ఎన్నికయ్యారు. గ్రామ గ్రామ వార్డు సభ్యులుగా అరుణ, రమేష్ మంజుల అనంతమ్మ పెద్ద అంజమ్మ,,లక్ష్మి కృష్ణ,, అదేవిధంగా గ్రామ సర్పంచుకు ఉపసర్పంచ్ కు వార్డు సభ్యులకు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్ తో పాటు బసవరాజు వెంకటేష్ గుప్తా, శివరాములు పెంటప్ప తిమ్మన్న హనుమంతు రఘు వెంకటప్ప శ్రీను తిమ్మన్న బోడి నర్సింలు, హరీషు బాలప్ప ఎల్లప్ప, మల్లప్ప మునప్ప చంద్రప్ప, ఎం. ఆంజనేయులు, బాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి కోసం ముందుట



**నేటి సాక్షి, చెన్నూరు :** చెన్నూరు మండలం లోని ఎర్రగుంటపల్లె గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన సర్పంచు అభ్యర్థి దెబ్బ సుగుణ గ్రామ పంచాయతీ ఎన్నికల గెలిపిస్తే రానున్న రోజుల్లో మన గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటూ మన గ్రామ పంచాయతీ ప్రజల సమస్యలు తీరుస్తా మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ క్రిష్ణ డీసీసీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డిబలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎర్రగుంట పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి డెబ్బ సుగుణ రామన్న గెలుపు కొరకు చెన్నూర్ పట్టణ సీనియర్ నాయకులు లింగంపల్లి మహేష్ మరియు చెన్నూరి రాజేష్ లువార్డు సభ్యులు చెన్నూర్ పట్టణ అధ్యక్షులు చెన్న సూర్యనారాయణకాంగ్రెస్ పార్టీ సీరియల్ నాయకులు పాతర్ల నాగరాజుచింతల శ్రీనివాస్ దాసరి కమలాకర్ SD సాహిర్ కడవండి మహేష్ పెండ్యాల శ్రీకాంత్ md బషీర్ ఈర్ల నారాయణపెద్దకొండ నరేష్ శ్రీరాములు చింతల లక్మన్ వినయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రచారం లో పాల్గొన్నారు

# 'ఫ్రెండ్లీ ప్రెస్ క్లబ్'ను ఆశీర్వదించిన అయ్యప్ప





- దర్శనం అనంతరం 'శేష వస్త్రాల'చే పాత్రికేయులను సత్కరించిన ఆలయ కమిటీ

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల అయ్యప్ప గుట్టపై కొలువై ఉన్న మణికంఠ స్వామిని సోమవారం 'ఫ్రెండ్లీ ప్రెస్ క్లబ్' పాత్రికేయులు దర్శించుకున్నారు.అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ స్వామి.. గురుస్వామి చిదురాల నారాయణ స్వామిలు పాత్రికేయులను 'శేష వస్త్రాల'చే సత్కరించారు.

### అయ్యప్ప ఆశీస్సులతో.. సమాజ శ్రేయస్సు.!

కోరుట్లలో కొలువైన అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో.. అష్టైశ్వర్యాలతో తుల తూగాలని గురుస్వాములు ఆకాంక్షించారు.ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు.. మంత్రోచ్చారణలు నిర్వహించారు. అనంతరం అయ్యప్పస్వామి ప్రసాదం.. భిక్ష పెట్టించి సమాజానికి 'మీడియా' ద్వారా చేతనైనా చేయూత నందించాలని గురుస్వాములు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు అంబటి శ్రీనివాస్ స్వామి, చిదురాల నారాయణ స్వామి, ఆకుల రంజిత్ స్వామి, గణేష్ స్వామి, సత్యనారాయణ,మాజీ ఎంపిపి తోట నారాయణ, ఫ్రెండ్లీ ప్రెస్ క్లబ్'అధ్యక్షులు చిలువేరి లక్ష్మీరాజం, ప్రధాన కార్యదర్శి కత్తి రాజ్ శంకర్, గౌరవ సలహాదారు రాధారపు నర్సయ్య, లీగల్ అడ్వైజర్ బద్రి సృజన్,సహాయ కార్యదర్శి వనతడుపుల సంజీవ్, కార్యవర్గ సభ్యులు విఆర్ భార్గవ్, రాధాకృష్ణ,శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ నుంచి వచ్చిన రుద్రాక్ష వృక్షాలు

### ఆరు సంవత్సరాల తర్వాత దర్శనమిచ్చిన శివ అనుగ్రహం





**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) రామచంద్రాపురం :** మండలంలోని కుప్పం గ్రామానికి చెందిన రైతు జేజిరెడ్డి పొన్నాల ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రకృతిని పూజించే ఆయన 2019 సంవత్సరంలో తన వ్యవసాయ భూమిలో రెండు రుద్రాక్ష వృక్షాలను నాటారు. ఈ పవిత్ర వృక్షాలను ఆయన అప్పట్లో నేపాల్ నుంచి తీసుకువచ్చారు. ఆది నుంచి పరమశివుడి అనుగ్రహంతో, నిత్య పూజలు–భక్తితో ఈ వృక్షాలను సంరక్షిస్తూ వచ్చారు. కాలగమనంలో ఆరు సంవత్సరాలు పూర్తయ్యాక, ఈ రుద్రాక్ష వృక్షాలు ఇప్పుడు తొలిసారిగా రుద్రాక్షలను ధరించడం భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది కేవలం ప్రకృతి సంఘటన మాత్రమే కాకుండా, శివ కృపకు నిదర్శనంగా భక్తులు భావిస్తున్నారు. రుద్రాక్ష అనేది పరమశివుడి కన్నీటితో జన్మించిందన్న పురాణ విశ్వాసం ఉంది. అటువంటి పవిత్ర రుద్రాక్షలు స్వయంగా ఒక రైతు భూమిలో పుట్టడం ఆ ప్రాంతంలో భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ఈ వృక్షాల దర్శనం, రుద్రాక్షల అవతరణను శివ అనుగ్రహంగా, శుభ సూచకంగా భక్తులు భావిస్తున్నారు.ఈ సంఘటన ద్వారా భక్తి, ఓర్పు, విశ్వాసం ఉంటే పరమేశ్వరుడు అనుగ్రహం ప్రసాదిస్తాడని జేజీ రెడ్డి పొన్నాల అనుభవం తెలియజేస్తోంది. ఇది ఆధ్యాత్మికంగా ఒక అపూర్వమైన ఘట్టంగా నిలుస్తోంది.

# ఇన్ఫోసెమ్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం...



**నేటిసాక్షి ప్రతినిధి చందుర్తి (సతీష్) :** చందుర్తి మండలంలోని మల్యాల గ్రామంలో సోమవారం ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ఫర్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ (ఇన్ఫోసెమ్) సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఇన్ఫోసెమ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మహేష్ గారి నేతృత్వంలో నిర్వహించారు. ఆరోగ్య శిబిరంలో గ్రామానికి చెందిన 31 మందికి హెచ్ఐవీ రక్త పరీక్షలతో పాటు షుగర్, రక్తహీనత (హిమోగ్లోబిన్), రక్తపోటు వంటి ముఖ్యమైన వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం ఆరోగ్య పరిరక్షణపై, వ్యాధుల నివారణపై పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు ఇన్ఫోసెమ్ సంస్థ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తూ, ప్రజల ఆరోగ్య అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసెమ్ సంస్థకు చెందిన జి.ఎన్.ఎం కల్పన, ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మణ్, ఆశ కార్యకర్త మంజులతో పాటు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అయ్యప్ప స్వామి బిక్ష లో బిజెపి నాయకులు



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ డిసెంబర్ 15 :** హనుమాన్ టెంపుల్ లో న్యూ లాల్ బహదూర్ నగర్ వాస్తవ్యులు గిరిధర్ గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి బిక్ష లో బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఈ కార్యక్రమంలో యువ నాయకులు రావుల పృథ్వి , బసవరాజ్ స్వామి తదితరులు పాల్గొన్నారు

# గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులెన్ని..?

- ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులెన్ని..?
- సాధించిన పురోగతికి సంబంధించి, కేంద్ర పర్యాటక శాఖను వివరాలు కోరిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ
- తక్షణం స్పందించిన భారత ప్రభుత్వం, కృతజ్ఞతలు తెలియజేసిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు (న్యూఢిల్లీ) :** ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని,ఎ సి ఎ పథకం కింద, గత ప్రభుత్వ హయాంలో కేంద్ర పర్యాటక శాఖ ఆంధ్రప్రదేశ్కు కేటాయించిన నిధులెన్ని అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు భారత ప్రభుత్వాన్ని కోరారు.ఇందుకు కేంద్ర పర్యాటక శాఖ సానుకూలంగా స్పందించి, సాధించిన పురోగతికి సంబంధించిన వివరాలను లిఖిత పూర్వకంగా తమకు అందజేసినట్లు ఆయన తెలిపారు.న్యూఢిల్లీ పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.., ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో, ఆంధ్రప్రదేశ్ హక్కులు, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, రోజుకో అంశానికి సంబంధించి.., కేంద్ర ప్రభుత్వ శాఖలను వివరాలను కోరుతూ.., లిఖిత జవాబు రాబడుతున్న విషయం విదితమే.తాజాగా సోమవారం ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీల బృందంతో కలిసి ,ఎ సి ఎ పథకం కింద పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు, గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్లో అమలు పరచిన ప్రాజెక్టు ప్రతిపాదనల జాబితా.., వాటికి సంబంధించిన ఆమోదం, స్థితి.., గత ఐదేళ్లలో ఎ సి ఎ పథకం కింద మంజూరైన ప్రాజెక్టులు, వ్యయం, నిధుల మంజూరు, విడుదల, ఆమోదించిన వివరాలు.., అలాగే ఆమోదించిన ప్రాజెక్టుల అంచనా గడువు, సాధించిన భౌతిక పురోగతి.., అదేవిధంగా అభివృద్ధి పనుల కారణంగా స్థానభ్రంశం చెందిన ఇళ్లు, దుకాణాలకు ప్రభుత్వం ఏదైనా ఆర్థిక సహాయం అందిస్తుందా, అయితే, అందించిన పునరావాస సహాయం వంటి వాటికి సంబంధించిన వివరాలను సంవత్సరాల వారిగా లిఖిత పూర్వకంగా అందించాలని కోరారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.తక్షణం స్పందించిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఏపీ కూటమి ఎంపీల బృందం కోరిన సమాచారాన్ని సంబంధిత శాఖ లిఖిత పూర్వకంగా తమకు సమాధానం ఇచ్చిందనీ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ మీడియాకు వెల్లడించారు పర్యాటక శాఖ తన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం, కేంద్ర ఏజెన్సీల సహాయ పథకం కింద, పర్యాటక సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ఏజెన్సీలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి చెప్పినట్లు తెలియజేశారు. ఈ పథకం కింద, మంత్రిత్వ శాఖ మొత్తం 66 ప్రాజెక్టులకు ₹948.78 కోట్లు మంజూరు చేసిందని తెలిపిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు,పర్యాటక ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం కోసం కేంద్ర ఏజెన్సీల నుండి ప్రతిపాదనలను స్వీకరించడం నిరంతర ప్రక్రియగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అందిన ప్రతిపాదనలను నిర్దేశిత మార్గదర్శకాలు, షరతులను సూచనగా పరిశీలించి, ఆయా ప్రాజెక్టులకు ఆర్థిక సహాయాన్ని భారత ప్రభుత్వం అందిస్తుందనీ ఆయన పేర్కొన్నారు. మార్గదర్శకాల ప్రకారం, పునరావాస ప్యాకేజీని అమలు చేయడానికి సంబంధిత కేంద్ర ఏజెన్సీ బాధ్యత వహిస్తున్నట్లు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి తెలియజేసిన వివరాలను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు వివరించారు.తాను అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చిన భారత ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కి వినతి

- మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ శ్రీ మిక్కిలినేని మను చౌదరి గారికి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ డిసెంబర్15:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్వేనెంబర్ 329/2-329/10 లో గల 130 ఎకరాల పట్టాభూమి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో అంటే 2016 వ సంవత్సరం నుండి ప్రభుత్వ భూమిగా పేర్కొన్నారు.ఈ విస్తీర్ణంలో ఉన్న భూమి 1975 లో శాలివాహన బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు మహాదేవపురం కాలనీ లేఔట్ గా అప్పటి గ్రామ పంచాయతీ తీర్మానంలో ఆమోదం పొందడం జరిగింది. అలాగే అప్పటి రేవన్యూ అధికారులు 1967 సంవత్సరం నుండి అందజేసిన పహాని కాపీలు మరియు రేవన్యూ సంబంధిత పత్రాలతో గౌరవ న్యాయస్థానం హైకోర్టును సంప్రదించారు అనంతరం మహాదేవపురం వెల్ఫేర్ సొసైటీ కాలనీ యజమానులకు అనుకూలంగా హైకోర్టు న్యాయస్థానం తీర్పునిస్తూ రిజిస్ట్రేషన్ మరియు పర్మిషన్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతూ వచ్చింది. కానీ ప్రతి ప్లాట్ యజమాని వారి యొక్క అవసరం నిమిత్తం ప్లాట్ క్రయ విక్రయాల కోసం అలాగే ఇంటి పర్మిషన్ కోసం గౌరవ న్యాయస్థానాన్ని సంప్రదించడం అనేది చాలా వ్యయ ప్రయాసాలతో పాటు అధిక సమయం పట్టడం వల్ల చాలా ఇబ్బందులు ఎదు-ర్కోవాల్సి వస్తుందాని ఈరోజు ఉదయం మహాదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కలిసి వారి సమస్యలను తెలియజేసిన వెంటనే సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మహాదేవపురం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులతో కలిసి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్ళి గౌరవ కలెక్టర్ శ్రీ మిక్కిలినేని మను చౌదరి కి వినతిపత్రం అందజేసి త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరడమైనది.అనంతరం జిల్లా గౌరవ కలెక్టర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో పర్యవేక్షింపజేసి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, ప్రసాద్ దుగ్గాల, రామచంద్రారెడ్డి, రంగారావు, జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, ప్లాట్ యజమానులు మరియు కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మీ దేవేందర్ తో తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా సేవలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే



- ప్రతినిత్యం ప్రజా సేవలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...

**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ డిసెంబర్ 15:** ఈరోజు 132 - జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజల సంక్షేమం, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే పరమావధిగా పనిచేస్తున్నామన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం
16 డిసెంబర్ 2025


# జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- డిప్యూటీ కమిషనర్లకు మహా ఎమ్మార్పీఎస్ వినతి
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 24 వార్డులకు ఎస్సీ ఉపకులాల వారీగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్




**నేటి సాక్షి కుత్బుల్లాపూర్,డిసెంబర్ 15 :** కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ 25 , 26 పరిధిలో రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్లను న్యాయంగా అమలు చేయాలని మహా ఎమ్మార్పీఎస్ మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ముత్యపాగ శ్రీశైలం మాదిగ. కుత్బుల్లాపూర్ జంట సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక ఉద్యమ నమస్కారాలతో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఏర్పడి ఇప్పటికే 20 సంవత్సరాలు కాగా, జిహెచ్ఎంసిలో విలీనమై 15 సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. అప్పట్లో ఈ నియోజకవర్గంలో 8 డివిజన్లు ఉన్నప్పటికీ, ఎస్సీ వర్గాలకు ఒక్క సీటు కూడా రిజర్వ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా 2025లో జరిగిన వార్డు డెలిమిటేషన్ అనంతరం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 24 వార్డులు ఏర్పడ్డాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ అమలులో ఉన్న నేపథ్యంలో, రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఈ నిబంధనను కచ్చితంగా పాటించాలని డిమాండ్ చేశారు. ముఖ్యం గా ఎస్సీ రిజర్వేషన్లను మాల, మాదిగ తదితర ఉపకులాల వారీగా అమలు చేసి, ఎస్సీ సమాజానికి నిజమైన సామాజిక న్యాయం కల్పించాలని కోరారు. దశాబ్దాలుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల సామాజిక, రాజకీయంగా వెనుకబాటుకు గురవుతున్నారని పేర్కొన్నారు. అందువల్ల ఈసారి జరిగే జిహెచ్ఎంసి ఎన్నికల్లో రిజర్వేషన్ విధానాన్ని పారదర్శకంగా, సముచితంగా అమలు చేసి, ఎస్సీ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని అధికారులను కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, గతంలో న్యాయం జరగలేదని, ఇకపై అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ముత్యపాగ శ్రీశైలం మాదిగ తెలిపారు. ఈ అంశంపై డిప్యూటీ కమిషనర్లు సానుకూల నిర్ణయం తీసుకొని, రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఎస్సీ వర్గాలకు తగిన రిజర్వేషన్లు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కోటి సంతకాల భారీ ర్యాలీకి అనూహ్య స్పందన..!



- ఆరు మండలాల నుంచి వందలాదిగా తరలివచ్చిన నేతలు
- తుమ్మలగుంట నుంచి పద్మావతీపురం వరకు భారీ ర్యాలీ
- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాలతో రెపరెపలాడిన ద్విచక్రవాహనాలు
- ర్యాలీలో ద్విచక్రవాహనం నడిపి ప్రత్యేక ఆకర్షణగా చెవిరెడ్డి కుమారులు

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1,16,000 మంది సంతకంపెట్టి తమ వ్యతిరేకతను వ్యక్తం చేయగా ప్రజలు సంతకం పెట్టిన పత్రాలను ఇప్పటికే తిరుపతి జిల్లా పార్టీకి అందజేశారు.. అక్కడ నుంచి తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంకు తరలించే క్రమంలో చేపట్టిన భారీ ర్యాలీకి చంద్రగిరి నియోజక వర్గం నాయకులు, కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన లభించింది. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట తెలుగుతల్లి విగ్రహం నుంచి సోమవారం ప్రారంభమైన భారీ ర్యాలీ తిరుపతి పద్మావతీపురం వద్దకు చేరుకుంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ర్యాలీ ఒక గంటపాటు నగరంలో ప్రయాణించి పద్మావతీపురంలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకుంది. చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన భారీ ర్యాలీకి పార్టీ నేతలు, కార్యకర్తలు వందలాదిగా తరలివచ్చి విజయవంతం చేశారు. ర్యాలీలో ద్విచక్ర వాహనాలు ముందు వెళుతుండగా కార్లు వాటిని వెంబడిస్తూ వరుసక్రమంలో సాగుతుండటం చూసిన జనం జహయో జగనన్నా.. అంటూ నినదించారు.. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ర్యాలీలో పాల్గొన్న యువత నినాదాలతో హోరెత్తిస్తూ ముందుకు సాగారు.

### సీఎం చంద్రబాబు సొంత ఊరిలోనే వ్యతిరేకిస్తున్నారు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేసే సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయాన్ని ఆయన సొంత ఊరిలో నుంచే వ్యతిరేకిస్తున్నారని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విమర్శించారు. పేద ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్న చంద్రబాబు ప్రభుత్వంకు చంద్రగిరి నుంచే తగిన గుణపాఠం చెబుతారన్నారు. చంద్రబాబు నాయుడు పుట్టి, పెరిగిన ఊరు నుంచే ప్రజలు ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారంటే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసుకోవాలన్నారు. జగనన్న ఇచ్చిన ఒకే ఒక్క పిలుపుతో 1లక్షా 16వేల మంది ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేయడం జరిగిందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మీడియాకు వివరించారు.

### రెపరెపలాడిన పార్టీ జెండాలు

తుమ్మలగుంట నుంచి బయలుదేరిన భారీ ర్యాలీలో పార్టీ జెండాలు రెపరెపలాడాయి. ముందు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ద్విచక్రవాహనాలు నడుపుతూ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలబడతా వారి వెంట వందలాది మంది నాయకులు, కార్యకర్తలు తమ వాహనాలు నడుపుతూ ముందుకు సాగారు. సుమారు 300 ద్విచక్రవాహనాలు, 75 కార్లు ర్యాలీలో పాల్గొనగా వందలాది మంది నాయకులు, కార్యకర్తలు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తుమ్మలగుంట నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో పాటు ర్యాలీని విజయవంతంగా తీసుకువచ్చిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలను జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కె రోజులు ప్రత్యేకంగా అభినందించారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

### - ఎంపీ గురుమూర్తి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** రాష్ట్రంలోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అప్పటి ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేశారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. పార్లమెంటు ఆవరణలో వైసీపీ ఎంపీలు మెడికల్ కాలేజీల ఉద్యమ చిత్రాలను చూపుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్లమెంటరీ పార్టీ లీడర్ వైవి సుబ్బారెడ్డి, లోక్ సభ ఫ్లోర్ లీడర్ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, మద్దిల గురుమూర్తి, అయోధ్యా రామిరెడ్డి, గుమ్మా తనూజా రాణి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ప్రతి మెడికల్ కాలేజీకి అనుబంధంగా 500 పడకల ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, పారామెడికల్ కోర్సులు కూడా ప్రారంభించేలా సమగ్రంగా మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. కోవిడ్ వంటి అత్యవసర పరిస్థితుల్లో కూడా జిల్లా స్థాయిలోనే ప్రజలకు వైద్యం అందించాలనే గొప్ప లక్ష్యంతో ఈ కాలేజీలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని పక్కన పెట్టి లాభార్జనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ గురుమూర్తి విమర్శించారు. ప్రజల పన్నుల డబ్బులతో నిర్మించిన కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే విధానాన్ని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరన్నారు ఈ నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల ఉద్యమం చేపట్టామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున సంతకాలు చేసి, భారీ ర్యాలీలతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించారని చెప్పారు. ఈ నెల 18వ తేదీన తమ నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర గవర్నర్ ని కలిసి ప్రజలు పెద్ద ఎత్తున చేసిన సంతకాలు అందజేస్తారని ఎంపీ గురుమూర్తి తెలిపారు. అలాగే ఇప్పటికే పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి గారిని కలిసి ఈ అంశాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లి, ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని కోరినట్లు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యం, వైద్య విద్య భవిష్యత్తు కోసం ప్రతి స్థాయిలో పోరాడుతున్న పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల పక్షాన ఈ పోరాటం కొనసాగుతుందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి స్పష్టం చేశారు.

# ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ డిసెంబర్ 15 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మల్లంపేట్ యూత్ కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్ స్వామి మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకట్ రెడ్డి స్వామి గార్లు అయ్యప్ప స్వామి దీక్ష 41 రోజులు పూర్తి చేసుకొని శబరిమాల సన్నిధానానికి వెళ్తున్నా సందర్భంగా ఈరోజు నిర్వహించిన ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నా లినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి లి. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి (గోపాల్) పద్మ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శామీర్ పెట్ ప్రకాష్ రావు , గురువా రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని కాపాడుకోవాలి



**నేటి సాక్షి కుత్బుల్లాపూర్ డిసెంబర్ 15 :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ 2BHK సముదాయంలో మొదటి బ్లాక్ లబ్ధిదారులు నిర్వహించిన మొక్కలు నాటే లిఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ,మరియు ఉమ్మడి ఖుత్బుల్లాపూర్ మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ లి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనాన్ని కాపాడుతూ పెంపొందించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దొంతి మహేష్ ముదిరాజ్. సాదూయాదవ్. సల్మాన్ రాజ్ మరియు 1వ బ్లాక్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు , కమిటీ సభ్యులు సతీష్ తదితరులు, అలాగే మహిళలు & 2BHK లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# ఈ నెల 17న సెలవు

### 3వ విడత పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 15 :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 17వ తేదీన జరగనున్న 3వ విడత పోలింగ్ లో భాగంగా ఆయా ప్రాంతాలలో సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవుగా ప్రకటించడం జరిగిందని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సేవల అత్యవసరతకు లోబడి ఆ రోజు కార్యాలయానికి ఆలస్యంగా హాజరు కావడం / కార్యాలయం నుండి త్వరగా వెళ్లడం / తక్కువ వ్యవధి గైర్హాజరు విధానాన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఎన్నికల కోసం ఉపయోగించబోయే ప్రజా భవనాలు, విద్యా సంస్థల భవనాలు, ఇతర భవనాలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవు , పోలింగ్ రోజుకు ముందు రోజు స్థానిక సెలవుగా పరిగణించబడుతుందని తెలిపారు. ప్రకటించిన ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు/సంస్థల ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజు స్థానిక సెలవు ప్రకటించబడిందని తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఉన్న సంబంధిత అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు/వ్యాపార/పరిశ్రమ యాజమాన్యాలు తమ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పైన పేర్కొన్న రోజులను వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# మూడో విడత ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.
- జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో
- మూడో విడత ఎన్నికల పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ పూర్తి......



**నేటి సాక్షి,నారాయణపేట డిసెంబర్ 15 :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మూడో విడతలో ఎన్నికలు జరుగనున్న మక్తల్, మాగనూరు కృష్ణా, నర్వ, ఊట్కూరు మండలాల పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించారు. ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచా యతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ నాటికే ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు స్థానాలతో కూడిన గ్రామ పంచాయతీలకు పోలింగ్ జరపాల్సిన అవసరం లేకపోవడం వల్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ నుంచి మినహాయింపు కల్పించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. రెండవ విడతలో 920 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, 20 శాతం అదనంగా సిబ్బందిని రిజర్వ్ లో ఉంచుతూ ర్యాండమైజేషన్ జరిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సునీత రెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రంగంపేటలో ఉద్రిక్తత"



**నేటి సాక్షి (భూమయ్య) మెదక్ జిల్లా కొల్చారం :** రంగంపేటలో "కాంగ్రెస్, బి ఆర్ ఎస్ కార్యకర్తల."మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం చివరి రోజైన సోమవారం కొల్చారం మండలం రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. గ్రామపంచాయతీ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పాటలతో బతుకమ్మ ఆడుతూ ఉండగా రంగంపేటలో ఎన్నికల ప్రచారం కోసం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కాన్వాయ్ వచ్చింది. ఎమ్మెల్యే కాన్వాయ్ కి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుపడడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కారు నుండి దిగి నడుచుకుంటూ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం కోసం రంగంపేట కింది బజార్ వైపు వెళ్లారు. అయినప్పటికీ ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. సమయానికి కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ స్పందించి వర్గాలను తన సిబ్బందితో కలిసి నెట్టివేసి శాంతింపజేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది."

# రెండు ద్విచక్రవాహనాలు ఢీ ఇద్దరికి గాయాలు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 15 :** పుంగునూరు నియోజవర్గం చౌడేపల్లి మండలం, ఆమినిగుంట సమీపంలోగల ప్రెట్రోల్ బంకు వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం మోహెంత్ (24) ఆమినిగుంట వైపు నుండి చౌడేపల్లి వైపుకు వేగంగా వస్తున్న ఏపి39ఆర్ సి 1875 నెంబర్ గల ద్విచక్రవాహనం లో చౌడేపల్లి సంతగేటు కు చెందిన మెహెంత్,చౌడేపల్లి వైపునుండి తిరుపతి వైపు వెళ్తున్న ఏపి03 ఎయల్ 8882 పుంగనూరు మండలం,బండ్లపల్లి గిరి ఒక్కసారిగా ఎడమవైపునుండి రోడ్డుకు అడ్డంగా కుడివైపుకు తిప్పడం వలన వేగంగా వచ్చిన వాహనం ఢీ కొట్టడంతో మెహెంత్(24) కు నోటి దవడ కు బలమైన గాయం అయ్యింది, రోడ్డు పైన రక్తం ఎక్కువగా పోయింది.అంతే కాకుండా గిరి(54) కూడా కన్నుపైన బలమైన గాయం తగలడం,స్పృహకోల్పోవడంతో స్థానికులు ఇద్దరిని,చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదుచేసుకొని దర్యాప్తు ప్రారంబించారని తెలియజేశారు.

# ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కు కృతజ్ఞతలు

విద్యుత్ ట్రాన్సురులకు ప్రత్యేక పూజలు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) వెదురుకుప్పం :** మండలంలోని గొడుగుచింత గ్రామంలో స్థానిక సర్పంచి మధుబాబు విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి తీసుకువెళ్ళడం తో ఆయన వెంటనే స్పందించి గతంలో 16 హార్స్ ట్రాన్సుర్ ఉండగా ప్రస్తుతం 24 హార్స్ 63 ఆర్స్ ట్రాన్సుర్లు మంజూరు చేయించిన జీడి నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డా.వి.ఎం థామస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు సోమవారం గొడుగుచింత గ్రామంలో కొత్త ట్రాన్సార్మర్ల కు ప్రత్యేక పూజలు చేసి చార్జ్ చేసారు ఈ కార్యక్రమంలో వెదురుకుప్పం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు స్థానిక మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి సింగిల్ విండో చైర్మన్ బోడిరెడ్డి.సుధాకర్ రెడ్డి, సర్పంచ్ మధుబాబు,క్లస్టర్ కన్వీనర్ చెంగలరాయల రెడ్డి, మండల టిడిపి ఉపాధ్యక్షులు అక్కిం. మధు, లైన్ మేన్ కిరణ్, నాయకులు వర్మ,హరిబాబునాయుడు, బాలాజీ,చ్ంగల్రాయ్ నాయుడు,లక్ష్మన్ నాయుడు, కుమార్, సురేష్ రెడ్డి,భాస్కర్ రెడ్డి,విజయ్,గోపి,విక్కీ,జాకబ్, చిన్నస్వామి దదితరులు పాల్గొన్నారు

# బాల్య వివాహాలను అరికట్టాదానికి 100 రోజుల కార్యాచరణ



సీనియర్ సివిల్ జుడ్జే శ్రీమతి వింధ్య నాయక్

**నేటి సాక్షి నారాయణపేట డిసెంబర్ 15 :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ సభ్య కార్యదర్శి హైదరాబాద్ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం మహిళా & శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ బాల్య వివాహ రహిత భారత్ (బాల్ వివాహ్ ముక్త్ భారత్) కోసం 04.12.2025 నుండి 100 రోజుల ఇంటెన్సివ్ అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది మరియు నల్సా ఆశ (అవగాహన, మద్దతు, సహాయం & చర్య) ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (SOP) అమలును వేగవంతం చేయడానికి ప్రారంభించింది. దీనిలో భాగంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శ్రీ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం లీగల్ సర్వీసెస్ కార్యదర్శి శ్రీమతి వింధ్య నాయక్ అధ్యక్షతన "బాల్ వివాహ ముక్త్ భారత్ కోసం 100 రోజుల కార్యాచరణ కోసం పారా లీగల్ వాలంటీర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు ఆశ కార్యకర్తలకు శిక్షణ/రిఫ్రెషర్ సెషన్‌లను కోర్ట్ ప్రాంగణంలో నిర్వహించారు. న్యాయ మూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు ఏమిటి? బాల్య వివాహాలు అంటే ఏమిటి?, బాల్య వివాహ చట్టం అంటే ఏమిటి?, బాల్య వివాహాలను ఎలా అరికట్టాలి? బాల్య వివాహాల నివారణ, పిల్లల రక్షణ, పిల్లల హక్కులుపై గ్రామసభలు, పంచాయతీలు, కమ్యూనిటీ కేంద్రాలు మరియు మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు మరియు ఇతర ప్రదేశాలలో అవగాహన ప్రచారాన్ని చెయ్యాలని ఆదేశించింది. దేనిలో భాగంగా అంగన్వాడి కార్మికుల పాత్ర, ఆశా కార్యకర్తల పాత్ర గురించి వివరించి పారా లీగల్ వాలంటీర్స్ కు 100 రోజుల ఇంటెన్సివ్ అవగాహన ప్రచారాన్ని సహకరించాలి ఆదేశించారు. తదుపరి జిల్లా బాలల రక్షణ అధికారి మరియు బాలల సంక్షేమ కమిటీ వారు మాట్లాడుతూ "బాల్య వివాహ నిరోధక చట్టం" అనే పదం బహుశా భారతదేశంలోని బాల్య వివాహ నిషేధ చట్టం, 2006ను సూచిస్తుంది , ఇది మునుపటి 1929 బాల్య వివాహ నిరోధక చట్టంస్థానంలో వచ్చింది . 2006 చట్టం బాల్య వివాహాలను నిషేధించే ప్రస్తుత చట్టం, ఇది 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న మగ మరియు 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఆడ పిల్లలను నిర్వచిస్తుంది మరియు ఇది అటువంటి వివాహాలను రద్దు చేయడానికి జరిమానాలు మరియు చట్రాన్ని అందిస్తుంది. పిల్లల రక్షణ, పిల్లల హక్కులు, బాల్య వివాహాల నివారణ పై విహరించారు. తదుపరి న్యాయ మూర్తి గారు పారా లీగల్ వాలంటీర్స్ కు 100 రోజుల కార్యాచరణ కోసం తగిన బ్యానర్స్ మరియు స్టిక్కర్స్ అందజేసారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ కార్యదర్శి శ్రీమతి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జుడ్జే బి మనోజ్ , అడిషనల్ జూనియర్ సివిల్ జుడ్జే అవినాష్, కే.లక్ష్మీపతి గౌడ్ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ , జిల్లా బాలల రక్షణ అధికారి (డీసీపీవో), జిల్లా బాలల రక్షణ యూనిట్ (డీసీపు) తరుపున కరిష్మా , బాలల సంక్షేమ కమిటీ తరుపున శ్యామల సభ్యురాలు), అంగన్వాడి కార్మికులు, ఆశా కార్యకర్తలు మరియు పారాలీగల్ వాలంటీర్లు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# కలగా మిగిలిన బాలకార్మిక నిర్మూలన

## టీ షాపులలో నలిగిపోతున్న బాల్యం

**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి డిసెంబర్ 15 :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనేది పిల్లల శారీరక, మానసిక,విద్యాభివృద్ధికి అత్యంత అవసరం,దీనికోసం బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, 1986 వంటి చట్టాలు 14 ఏళ్లలోపు పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో నియమించడాన్ని నిషేధి. స్తున్నాయి, అయితే దారిద్ర్యం,నిరక్షరాస్యత ప్రధాన కారణాలు కాబట్టి పేదరికాన్ని నిర్మూలించడం,అవగాహన కల్పించడం, ప్రభుత్వ, సామాజిక భాగస్వామ్యంతో పాటు బాలల హక్కులను పరిరక్షించడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చు. బాల కార్మిక వ్యవస్థ అంటే ఏమిటి?18 సంవత్సరాల లోపు పిల్లల చదువుకు, ఎదుగుదలకు ఆటంకం కలిగించే శారీరక, మానసిక, సామాజిక, నైతిక హాని కలిగించే పనిని బాల కార్మిక వ్యవస్థ అంటారు.ఈ వ్యవస్థ పిల్లల బాల్యాన్ని, విద్యా హక్కును హరించివేస్తుంది, వారిని దోపిడీకి గురిచేస్తుంది.బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం,1986: 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకరమైన వృత్తులలో నియమించడాన్ని ఇది నిషేధిస్తుంది.2016 సవరణ చట్టం అన్ని వృత్తులలో పిల్లలను నిమగ్నం చేయడాన్ని నిషేధించి, కౌమారదశలో ఉన్న వారిని ప్రమాదకరమైన పనుల్లో నియమించడాన్ని కూడా అడ్డుకుంటుంది.

## సమస్యకు కారణాలు:

కుటుంబ పోషణ కోసం పిల్లలు పని చేయాల్సి వస్తుంది.విద్య లేకపోవడం వలన బాల కార్మిక వ్యవస్థ పెరుగుతుంది.పేదరికం,నిరక్షరాస్యతతో ముడిపడి ఉన్నందున ఇది ఒక సంక్లిష్టమైన సమస్య.పిల్లలను పనిలో పెట్టకుండా ఆపడానికి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం.బాలల హక్కులపై,బాల కార్మిక వ్యవస్థ వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం.చట్టాలను కఠినంగా అమలు చేయడం, బాల కార్మికులను రక్షించడం. పిల్లలందరికీ విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారిని బడికి పంపించడం.బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనేది ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సెంటర్ ఫర్ ఆక్ట్స్ అండ్ రైట్స్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు ఉత్తరాది హరిప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం బాలకార్మిక నిర్మూలన కొరకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్ననూ చౌడేపల్లిలో మాత్రం ఎటువంటి బాలకార్మిక నిర్మూలన జరగడం లేదని,అలాగే బాల్యవివాహాలు కూడా జరుగుతున్ననూ ఇటు అధికారులు, అటు తల్లిదండ్రులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు.పట్టణంలోని సిలిగూరి టీ షాపులో బాలకార్మికుడు పనిచేస్తున్ననూ, ఎవరూ పట్టించుకోక పోవడం, బాలకార్మిక వ్యవస్థను



చూసి చూడనట్లు వదిలేస్తున్న అధికారులు, సామాజిక కార్యకర్తలు, కావున ఇకనైనా సామాజిక కార్యకర్తలు బాలకార్మిక నిర్మూలన పై నడుంబిగించాల్సిన అవసరం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ లో విజయవంతమైన క్యాంపస్ డ్రైవ్

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** స్థానిక రామకృష్ణ డిగ్రీ %ు%పీజీ కళాశాల మరియు మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ సంయుక్తంగా కళాశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ లొ వివిధ కళాశాలలకు చెందిన డిగ్రీ చివరి సంవత్సరం మరియు పూర్తిచేసిన విద్యార్థులు సుమారుగా 400 మంది పాల్గొన్నారు. 180 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో తుది దశకు చేరుకున్నారు.ఈ క్యాంపస్ డ్రైవ్ లో ప్రముఖ సాఫ్ట్వేర్ సంస్థ టెక్ మహీంద్రాతో పాటు మరో 8 బహుళ జాతి సంస్థలు పాల్గొని అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసినారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగాలు అందించుటకు ప్రతి సంవత్సరం తమ కళాశాల తరఫున ఇలాంటి క్యాంపస్ డ్రైవ్ ల నిర్వహణ జరుగుతోందని, ఈ ప్రాంత విద్యార్థులు ఐట్టి అవకాశాలను వినియో గించుకొని కార్పోరేట్ ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్ ప్లేస్మెంట్ ఆఫీసర్ బి మల్లేష్ ,మ్యాజిక్ బస్సు ప్రతినిధులు పవిత్ర, శివ మరియు వివిధ కంపెనీల




రిక్రూటర్స్ పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరిక



- **నూతన సర్పంచ్ ఉపసర్పంచ్‌లకు డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క సన్మానం**

**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 15 :** జైనూర్: జైనూర్ మండలం గౌరీ కొళాంగూడ నూతన సర్పంచ్ ఆత్రం అయ్యుబాయి, ఉపసర్పంచ్ షేక్ ఫైజల్‌తో పాటు పలువురు వార్డు సభ్యులను లేండి గూడాలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన ప్రజాప్రతినిధులను శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ ప్రజల ఆశయాలను నెరవేర్చేలా నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు పాలన సాగించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి,మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ విజయోత్సవ సభలో పలువురు. బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి సుగుణక్క పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రజా పాలనకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం భుజంగరావు, సీనియర్ నాయకులు షేక్ రషీద్, మండల ఉపాధ్యక్షుడు పేందూర్ ప్రకాష్,మాజీ ఎంపిటిసి యశ్వంత్ రావ్, హజ్జులాల,సుద్దాల శ్రీనివాస్,సుద్దాల ఆనంద్, అఫ్రోజ్, గణపతి, ఫైజల్ ఖాన్, హైదర్, దత్తు,ఆత్రం బాపూరావు,షాకీర్, తాజ్,మహేష్, కాంగ్రెస్ పార్టీలో చేరిన ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

- **వానరానికి అంత్యక్రియలు నిర్వహించిన కార్మిక సంఘ నేత**



**నేటి సాక్షి - రాజన్న సిరిసిల్ల :** మనిషి–జంతువు మధ్య అనుబంధాన్ని మరోసారి చాటిచెప్పే ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రహదారి పక్కన నిర్లక్ష్యంగా పడి ఉన్న వానరానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి, మానవత్వం ఇంకా బ్రతికే ఉందని నిరూపించారు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు.

## కరెంట్ షాక్‌తో వానరం మృతి

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పరిధిలో, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెనుకభాగంలో ఉన్న ఎయిర్‌టెల్ టవర్ సమీపంలో శుక్రవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో ఓ వానరం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డుపై వానరం మృతదేహం పడి ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## మనసు కదిలిన కార్మిక సంఘ నాయకుడు

అదే సమయంలో అటుగా వెళ్లిన భవన నిర్మాణ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు అక్కెనపెల్లి భాస్కర్ ఈ ఘటనను గమనించారు. మృత వానరాన్ని చూసి చలించిపోయిన ఆయన, అది నిర్లక్ష్యానికి గురికాకూడదని నిర్ణయించారు. వెంటనే తన సహచరుల సహకారంతో వానరాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు.

## గౌరవప్రదంగా అంత్యక్రియలు

వానరానికి తగిన విధంగా అంత్యక్రియలు నిర్వహించాలనే సంకల్పంతో అక్కేనాపెల్లి భాస్కర్ వాగు వద్దకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బైరగోని శ్రీనివాస్, ఎస్కే జహీర్, ఎదుల్లా భద్ర, చిలుక నర్సింలు పాల్గొని మానవత్వానికి మద్దతుగా నిలిచారు.

## సమాజానికి సందేశం

జంతువుల పట్ల కూడా మనుషుల్లాగే గౌరవం చూపించాల్సిన అవసరం ఉందని, ప్రతి ప్రాణానికి విలువ ఉంటుందనే సందేశాన్ని ఈ ఘటన స్పష్టంగా చాటిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. రహదారులపై, ప్రజా ప్రదేశాల్లో జంతువులు మృతి చెందినప్పుడు బాధ్యతగా స్పందించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు.

# రాయచోటి వేదికగా కదిలొచ్చిన వైసీపీ దండు

- **మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాయచోటిలో ప్రజాగర్జన..**
- **ఉప్పెనలా అన్నమయ్య జిల్లాలో కోటి సంతకాల సమరం..**
- **రాయచోటిలో గర్జించిన ప్రజా స్వరం..**
- **వైద్యవిద్యను కాపాడుకు నేందుకు కదం తొక్కిన ప్రజలు..**
- **ఉద్యమ జ్వాలలతో దద్దరిల్లిన రాయచోటి..**



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 15 :** అన్నమయ్య జిల్లా :–: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు చేపడుతోంది. ర్యాలీ తర్వాత అన్ని జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తాడేపల్లి కేంద్ర కార్యాలయానికి కోటి సంతకాల ప్రతులను సాగరంపుతారు. వాటిని ఈనెల 18న వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆయనతో పాటు మరి కొందరు వైసీపీ ముఖ్య నేతలు కలిసి గవర్నర్ నజీర్ అహ్మద్ కు అందజేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణను నిలిపేయాలని వైయస్ జగన్ గవర్నర్ ను కోరనున్నారు. అక్టోబర్ 10న ప్రారంభమైన రచ్చబండ కార్యక్రమంలో కోటి సంతకాలను సేకరించిన విషయం విదితమే. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పీపీపీ (ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యం) లో అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకోగా ఈ చర్య పూర్తిగా మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయడమేనని వైసీపీ నేతలు మాజీ మంత్రి, ఉమ్మడి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయచోటి మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమ–రనాథ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, నిస్సార్ అహ్మద్, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పార్లమెంట్ పరిశీలకులు సురేష్ బాబు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కార్యదర్శి నూతన కాల్వ అనిషారెడ్డి, వైసీపీ ముఖ్య నాయకుడు నూతన కాల్వ శ్రీనాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్ రెడ్డి లు మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ 10న ప్రారంభమైన ‘రచ్చబండ’ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాలను సేకరించినట్లు పార్టీ నేతలు తెలిపారు. మెడికల్ విద్య సామాన్యులకు దూరమవుతుందనే ఆందోళనతోనే ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పబ్లిక్ – ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని వైసీపీ ‘ప్రైవేటీకరణ’గా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ ప్రజా ఉద్యమానికి అనూహ్య స్పందన లభించిందని, ప్రజల మనోభావాలను గౌరవించి ప్రభుత్వం తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరిం చుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పబ్లిక్ – ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని వైసీపీ ‘ప్రైవేటీకరణ’గా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని గత వైసీపీ ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్య అందించాలనే సంకల్పంతో 17 కొత్త మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, ఇందులో ఐదు కళాశాలలు పూర్తి కావొచ్చాయని అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం పేరుతో ఈ కళాశాలలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి, పేదలకు వైద్య విద్యను, ఉచిత వైద్యాన్ని దూరం చేస్తోందని పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రజా ఉద్యమానికి అనూహ్య స్పందన లభించిందని, ప్రజల మనోభావాలను గౌరవించి ప్రభుత్వం తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ద్వారకానాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో సేకరించిన 3 లక్షలకు పైగా కోటి సంతకాల పత్రాలను ప్రత్యేక వాహనంలో నింపి రాయచోటి పట్టణ పరిధిలోని చెక్ పోస్ట్ వద్ద నున్న శివాలయం నుంచి బంగ్లా వరకు వైఎస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించామని స్వచ్ఛంధంగా, వేలాదిగా యువత, విద్యార్థులు, మేధావులు, విద్యావంతులు, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు, పెద్ద ఎత్తున వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలొచ్చి సంఘీభావం తెలిపినందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని 3 లక్షల పైగా కోటి సంతకాల పత్రాలను నింపిన వాహనానికి జెండా ఊపి రాయచోటి నుంచి తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపడం జరిగిందని ఆయన తెలిపారు. మెడికల్ కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరించే చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం అన్నమయ్య జిల్లాలో మహోద్యమంగా మారిందన్నారు. చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పేదల వైద్యవిద్య హక్కును కాపాడాలన్న సంకల్పంతో సాగిన ఈ ఉద్యమం రాయచోటి పట్టణాన్ని కదిలించిందని పేర్కొన్నారు. ఆకేపాటి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రం నుంచి తాడేపల్లి వైఎస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయానికి కోటి సంతకాల పత్రాల తరలింపు సందర్భంగా రాయచోటిలో నిర్వహించిన భారీ ర్యాలీకి ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారని జిల్లాలో సేకరించిన 3 లక్షల సంతకాల పత్రాలతో నింపిన వాహనం రాయచోటి చెక్‌పోస్ట్ శివాలయం నుంచి బంగ్లా వరకు సాగిన ర్యాలీలో ప్రజాగ్రహం ప్రతిబింబించిందని ఆయన పేర్కొన్నారు.

## స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ప్రజలు..

యువత, విద్యార్థులు, మేధావులు, విద్యావంతులు, ప్రజాసంఘాలు, వైఎస్ఆర్ సీపీ శ్రేణులు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వ తీరుపై నిరసన గళం వినిపించారని ప్రజల హక్కైన వైద్యవిద్యను ప్రైవేటు బినామీలకు అప్పగించడాన్ని సహించబోమని ఆకేపాటి అమరనాథ్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్యవిద్య ఉండాలి..

మెడికల్ కళాశాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగాలని, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందించాలని ప్రజలు డిమాండ్ చేశారని పీపీపీ మోడల్ పేరుతో ప్రజా వైద్యంపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని కొరముట్ల శ్రీనివాసులు నినదించారు. “వైద్యవిద్య అమ్మకానికి కాదు – ఇది ప్రజల హక్కు”, “పిపిపి మోడల్ రద్దు చేయాలి. ప్రజా వైద్యంపై కూటమి కుట్రలను తిప్పికొడదామంటూ అనీషా రెడ్డి అన్నారు. ఆమె ఈ వ్యాఖ్యలు చేయడంతోనే వైసీపీ శ్రేణులు యువత నినాదాలతో హోరెత్తించారు..

# రెబ్బన మండలంలో ఇంటింటికి ప్రచారంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే



**నేటి సాక్షి కొమరం భీమ్ ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 15 :** ఆసిఫాబాద్ నియోజకవర్గం రెబ్బన మండలంలోని ఖైరిగాం, గంగాపూర్, లక్ష్మి పూర్, నంబాల, ఖైరిగూడ గ్రామ పంచాయతీల సర్పంచ్ అభ్యర్థులు (ముంజం రూపేశ్వర్, నగోశ విలాస్, కొలె శ్యామ్ రావు, దుర్గం కమలబాయి–శివాజీ,ఎర్రవేని వెంకటేష్) మరియు ఇతర వార్డ్ మెంబర్స్ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యే కోవ లక్ష్మి. ప్రతి ఇంటి ఇంటికి తిరుగుతూ ప్రజలను కలిశారు. బి ఆర్ ఎస్. ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను (కల్యాణ లక్ష్మి, రైతు బంధు, తదితర) వివరంగా వివరించారు. బి ఆర్ ఎస్. పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామా ప్రజలను అభ్యర్థించారు. మళ్లీ వచ్చేది బి ఆర్ ఎస్. ప్రభుత్వమే అని ఎమ్మెల్యే. ప్రజలకు పూర్తి భరోసా కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలు గ్రామ పంచాయతీల నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ లంచ్ మీటింగ్ కి ఆహ్వానం..

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంట్లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ లంచ్ మీటింగ్ కి ఆహ్వానం..**



**నేటి సాక్షి 15 నంద్యాల :** న్యూ ఢిల్లీలో సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర ఐటీ శాఖ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ టీడీపీ పార్లమెంట్ సభ్యులతో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటిలో లంచ్ మీటింగ్ నిర్వహించారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆహ్వానం మేరకు ఢిల్లీలోని ఆమె ఇంటికి రాష్ట్ర మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తో పాటు టీడీపీ పార్లమెంటు సభ్యులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇంటికి రాగానే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంత్రి నారా లోకేష్ తో పాటు తోటి పార్లమెంట్ సభ్యులకు సాధర స్వాగతం పలికారు. ఢిల్లీలోని తన ఇంటిలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు, నాతోటీ ఎంపీ లకు భోజనానికి ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**భానుముక్కల గ్రామ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేసిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య**



**నేటి సాక్షి 15 పాములపాడు :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)నుంచి మంజూరైన నందికొట్కూరు నియోజకవర్గం, పాములపాడు మండలంలోని, భానుముక్కల గ్రామానికి చెందిన గడ్డం.జీవన్ కి 15,000/– రూపాయలు చెక్కును నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త.జయసూర్య నాయకులతో కలిసి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు పాములపాడు సొసైటీ చైర్మన్ సి.గోవిందు, కొత్తపల్లి మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్, మద్దూరు తిమ్మారెడ్డి, జూటూరు పూసల కృష్ణ, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఏ–రవీంద్ర, మాంద్ర.శివానందరెడ్డి పిఏ– మద్దిలేటి, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
14
మంగళవారం
16 డిసెంబర్ 2025

# ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి

- సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించాడు
- రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని జగిత్యాల పట్టణ కొత్త బస్టాండ్ లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి కాశీనాథం,సమరసత వేదిక జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాధర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర పోషించాడని, స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి ఉప ప్రధాని హోం మంత్రిగా కూడా పనిచేశాడని, 560 కి పైగా స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ సమైక్యతకు కృషి చేశాడని నిజాం నిరంకుశ పరిపాలన నుండి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కూడా కల్పించాడని అతని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధనకార్యదర్శి అక్కినపెల్లి కాశీ నాదం,చిట్ల గంగాధర్,బా.సు.స. కార్యదర్శి సింగం గంగాధర్,ఉపాధ్యక్షుడు వేముల పోచమల్లు, కొత్తకొండ బాలన్న, అనుమల భుజంగం,వేముల శంకర్,రాయికల్ రామచంద్రం,ఆర్ఎస్ఎస్ వీరన్న,ఎడమల వెంకట్ రెడ్డి, కె ఆర్ కృష్ణ చిలుక రాజన్న, బొందుకూరి శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి మౌలిక వసతులు



- పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం కూటమి ప్రాధాన్యత
- రావినూతల, చందలూరుల్లో జూనియర్ కళాశాలలు
- సోలార్ తో తగ్గనున్న విద్యుత్ వినియోగ భారం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (అద్దంకి) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో గ్రామాల్లోనూ పట్టణాలకు ధీటుగా పూర్తి స్థాయిలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని కొరిశపాడు మండలం, రావినూతల గ్రామంలో సోమవారం మంత్రి గొట్టిపాటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రూ.1.30 కోట్లతో నిర్మించిన అంతర్గత రహదారులు, కల్వర్టులు, సైడు కాల్వలను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఆ తరువాత రావినూతల గ్రామంలోనే రూ.20 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలును మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూపేదలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా చెప్పారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో సుమారు 30 హెల్త్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ఒక్కొక్కటీ రూ.36 లక్షలతో నిర్మించే హెల్త్ సబ్ సెంటర్లతో నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాలను సంబంధిత తహశీల్దార్లు వెంటనే గుర్తించాలని ఆదేశించారు. ప్రైవేటు దాతలు స్థలాలు ఇవ్వడానికి ముందుకు వస్తే హెల్త్ సెంటర్లకు వారి పేర్లను పెట్టాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడం తన బాధ్యత అన్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే రూ.21.50 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఐదు మండలాల పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. సోలార్ వినియోగంతో ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం గణనీయంగా తగ్గుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గుజరాత్ రాష్ట్రం సోలార్ వినియోగంతో ఎంతో అభివృద్ధి సాధించిందని తెలిపారు. సూర్యఘర్ సోలార్ పథకం ద్వారా ఒక్కో వినియోగదారునికి రూ.78 వేలు సబ్సిడీ అందిస్తున్నామన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ రుణం ద్వారా ఐదారేళ్లలో తీర్చే వెసులుబాటు ఉందన్నారు. దేశవ్యాప్తంగా కోటి సోలార్ కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకుంటే, అందులో 25 లక్షల కనెక్షన్లను ఆంధ్రప్రదేశ్ కు మంజూరు చేసినట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఒక్కో నియోజకవర్గానికి 10 వేల సోలార్ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా 10, 20 మంది సోలార్ పెట్టుకుని దాని వల్ల ఉపయోగం ఉంటుందని భావిస్తేనే మిగిలిన వారు పెట్టుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో వచ్చే సోలార్ పథకాలను వినియోగించుకుంటే ప్రజలకే లాభమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల విశ్వాసంతో అగ్రస్థానంలో నోవా గ్రూప్స్




- రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ఉత్పత్తుల ఆవిష్కరణ
- అన్నదాతలకు వెన్నుదన్నుగా నోవా గ్రూప్స్
- రైతుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఉత్పత్తులు
- నోవా ధృవ, డిఫెండర్ ప్రోడక్ట్ ల ఆవిష్కరణ
- ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఏలూరి

**నేటి సాక్షి,బాపట్ల జిల్లా ప్రతినిధి :** అన్నదాతల విశ్వాసమే పెట్టుబడిగా, రైతన్నల ఆశలు ఆకాంక్షల , అవసరాలకు అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులతో ఉత్పత్తులను అందిస్తూ నోవా గ్రూప్స్ వ్యవసాయ రంగంలో అగ్రభాగాన నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. చీరాలలో నోవా అగ్రి గ్రూప్ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ వేడుకకు ఎమ్మెల్యే ఏలూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నోవా అగ్రి గ్రూప్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏటుకూరి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి ప్రసంగించారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న నోవా గ్రూప్స్ సేవలు అభినందనీయమని ఆయన ప్రశంసించారు. గత 15 సంవత్సరాలుగా నోవా గ్రూప్స్ నిరంతరం రైతుల అవసరాలకు అనుగుణంగా మారుతున్న సాంకేతిక పద్ధతులతో ఉత్పత్తులను రూపొందిస్తూ రైతన్నలకు అండగా నిలుస్తూ అభ్యున్నతికి పాటుపడుతుందన్నారు. కోట్లాదిమంది రైతుల అభిమానాన్ని సొంతం చేసుకుని నోవా నిరంతరం అన్నదాతల పక్షాన నిలుస్తుందన్నారు. రైతు నిలబడితేనే దేశం మనుగడం, ప్రజలకు కడుపునిండా రెండు పూటలా తిండి, అధిక వ్యవస్థ బలోపేతం, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తుల కంపెనీలు ప్రగతి దిశగా అడుగులు వేస్తాయన్నారు. కంపెనీలు తాత్కాలిక ప్రయోజనాల కోసం ఆర్థిక బలోపేతం కోసం రైతులకు నష్టం చేకూర్చే ఉత్పత్తులను రూపొందించకుండా రైతులకు మేలు జరిగే ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు అర్జించేలా అన్నదాతకు చేయూతనివ్వాలన్నారు. రైతులు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తేనే వ్యవసాయ రంగంలో మంచి ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

### నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ...

నోవా గ్రూప్స్ ఆధ్వర్యంలో రైతు ప్రయోజనాల లక్ష్యంగా రూపొందించిన నోవా ధృవ మరియు డిఫెండర్ అనే నూతన ఉత్పత్తులను ఘనంగా ఆవిష్కరించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ అవసరాలకు తగ్గట్టుగా పరిశోధనాత్మకంగా రూపొందించిన ఈ ఉత్పత్తులు రైతులకు మరింత లాభదాయకంగా మారతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని, వారి పంట దిగుబడులు పెరిగేలా నూతన సాంకేతికతతో ఉత్పత్తులను రూపొందించడం నోవా గ్రూప్స్ ప్రత్యేకత అని తెలిపారు. భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమమే లక్ష్యంగా నోవా గ్రూప్స్ మరిన్ని వినూత్న ఉత్పత్తులను అందించాలన్నారు. ప్రధానంగా నోవా ధృవ, డిఫెండర్ ప్రోడక్ట్ లు మొక్కజొన్న పంటకు రక్షణ కవచంలా నిలుస్తుందని పేర్కొన్నారు. మొక్కజొన్నలో చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడులు సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నోవా గ్రూప్స్ ప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు, డీలర్లు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఏలూరి పాదయాత్రకు 13 ఏళ్ల పూర్తి




**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (పర్చూరు) :** పర్చూరు నియోజకవర్గంలో ప్రజల హృదయాల్లో నిలిచిన “పల్లె పల్లెకు తెలుగుదేశం” కార్యక్రమం ప్రారంభించి 13 సంవత్సరాలు పూర్తి కావడం సందర్భంగా పర్చూరు బొమ్మల సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ నేతలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేపట్టిన పాదయాత్ర స్ఫూర్తిని స్మరించుకుంటూ తెలుగుదేశం పార్టీతో పాటు కూటమి నాయకులు కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ శంషుద్దీన్ మాట్లాడుతూ, గ్రామ గ్రామాన అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ పాదయాత్ర సాగిందని గుర్తు చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై నాయకత్వానికి బలమైన పునాది వేసిన ఈ పాదయాత్ర పర్చూరు నియోజకవర్గ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోడూరి శేష బ్రాహ్మాచారి, టౌన్ పార్టీ అధ్యక్షులు ఆకుల శ్రీను,కొల్లా బుల్లి బాబు,అబ్రహం,గద్దె చిన్న, కొండగంటి శివ, టి. శ్రీను, సాంబయ్య, కటారి సురేంద్ర, కటారి దుర్గా,సుమన్, శ్రీధర్, సురేష్, మల్లా శ్రీను, చంటి తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ఆర్‌సీపీ ఎంపీలు ప్లకార్డులతో నిరసన..



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 15 :** అన్నమయ్య జిల్లా :-: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయొద్దంటూ వైయస్ఆర్‌సీపీ ఎంపీలు ఢిల్లీ వేదికగా నిరసన బాట పట్టారు. సోమవారం పార్లమంట్ సమావేశాల్లో పాల్గొన్న వైయస్ఆర్‌సీపీ ఎంపీలు సమావేశం పూర్తవగానే పార్లమెంట్ మకద్వారం ఎదుట ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంశానికి సంబంధించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనకు దిగారు. ఎంపీలు వై.వీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, మద్దిల గురుమూర్తి, వైయస్ అవినాష్ రెడ్డి, తనుజ రాణి, అయోధ్య రామిరెడ్డిలు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా వైయస్ఆర్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ‘ ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసామని రాష్ట్రంలో కోట్లాది సంతకాలు సేకరించడం జరిగిందని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఈనెల 18న గవర్నర్ నజీర్ ను కలిసి కోటి సంతకాలు సేకరణ పై ఆయనకు వివరిస్తామని కూటమి ప్రభుత్వం తీసుకున్న అసమర్థత నిర్ణయంపై తమ గళం వినిపిస్తూనే ఉంటామని వాళ్లు తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకొని ప్రైవేటీకరణ వెనక్కి తీసుకేనేంతవరకూ పోరాటం ఆగదని హెచ్చరించారు..

# అంగరంగ వైభవంగాకొమురవెల్లి మల్లన్న కళ్యాణం



**నేటి సాక్షి ,చేర్యాల :** భక్తుల కొంగు బంగారమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణం ఆదివారం కనుల పండువగా జరిగింది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా ముగిసింది. సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొనడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఏటా మార్గశిరమాసం చివరి ఆదివారం ఈ కల్యాణం నిర్వహిస్తారు. ఉదయం 10.45 గంటలకు మల్లికార్జునుడు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను వివాహమాడారు. బర్దీపూర్ వీరశైవ ఆగమ సంప్రదాయ పీఠాధిపతులు మహంత్ సిద్దేశ్వరానం దగిరి స్వామీజీ వేద పర్యవేక్షణలో క్రతువు జరిపించారు. ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్య కార్యదర్శి ఎ శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ హరీశ్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఉత్సవ కమిటీ సభ్యులు కల్యాణోత్సవ ప్రత్యేకాధికారి రామకృష్ణారావు, ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం
16 డిసెంబర్ 2025
15

# అప్పులు చేస్తూ పోతే ఆంధ్ర రాష్ట్రం అప్పులమయం కాక తప్పదు

- కడప - బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించాలి.. మిథున్ రెడ్డి



**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 15 :** అన్నమయ్య జిల్లా :-: లోక్‌సభ సాక్షిగా ఏపీ అప్పులు, కుంభకోణాలపై వైయస్ఆర్‌సీపీ రాజంపేట లోక్‌సభా పక్షనేత ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి నిలదీశారు. ఈ మేరకు పార్లమెంటులో కొన్ని అంశాలను ఆయన ప్రస్తావిస్తూ కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి కేవలం 18 నెలల్లో ₹ 2.5 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందన్నారు. ఐదేళ్లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు ₹ 3 లక్షల 32 వేల కోట్లు మాత్రమేనని ఆయన చెప్పుకొచ్చారు. వైయస్ జగన్ ఐదేళ్లలో కేవలం ₹ 3 లక్షల 32 వేల కోట్లు చేస్తే కూటమి ప్రభుత్వం 18 నెలల్లోనే ₹ 2.5 లక్షల కోట్లకు పైగా అప్పు చేసిందన్నారు. దీని సగటుగా తీసుకుంటే మరో మూడేళ్లలో ఎంత అప్పు చేస్తారు. తర్వాత అధికారాన్ని చేపట్టిన వాళు ఎలా అప్పులు తీరుస్తారని ఇలా అప్పులు చేస్తూ పోతే ఆంధ్ర రాష్ట్రం అప్పులమయం కాక తప్పదని మిథున్ రెడ్డి విమర్శించారు. బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా కూడా 9% వడ్డీకి ₹ 6000 కోట్ల అప్పులు సేకరిస్తున్నారని ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వ నిధి నుంచి డబ్బులు డ్రా చేసే అవకాశం కల్పించడం దారుణమని ఇది పూర్తిగా కుంభకోణమేనని రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి, అధిక వడ్డీకి అప్పులు తెచ్చి ప్రజలపై భారం మోపుతున్నారని మిథున్ రెడ్డి దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే అన్ని అప్పులు సీలింగ్ పరిధిలోకి వస్తాయని కేంద్రం స్పష్టం చేసిందని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పుల కోసం ప్రయత్నిస్తే సీలింగ్ విధించారని మరి 9% వడ్డీకి ఇప్పుడు అప్పులు తీసుకోవడానికి కేంద్రం ఎలా అనుమతించిందని మిథున్ రెడ్డి ప్రశ్నల వర్షం కురిపిస్తూ కేంద్రం ఏమైనా నిబంధనలను మార్చిందా అని మిథున్ రెడ్డి ప్రశ్నించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే ఆపివేయాలని ప్రభుత్వం చేతుల్లోనే వైద్యరంగం ఉండాలని లాభాపేక్షతో కూడిన ప్రైవేటుతో ప్రజలకు నష్టం జరుగుతుందని మిథున్ రెడ్డి వాపోయారు.

### 2.66 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం వైద్య కళాశాలలను కాపాడలేదా..!

₹ 2.66 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం వైద్య కళాశాలలను కాపాడలేదా అంటూ మిథున్ రెడ్డి ప్రశ్నించారు. కడప - బెంగళూరు రైల్వే లైన్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించాలని ఆయన పేర్కొన్నారు. విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి గనులు కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. తెలుగుదేశం పార్టీ నుంచి కేంద్రమంత్రిగా ఉన్న చంద్రశేఖర్ సొంత నియోజకవర్గంలో కూడా కూలీలకు వేతనాలు రాకపోవడంపై ఏం చేస్తున్నారో తెలియటం లేదని పేర్కొంటూ ఇది సిగ్గుచేతంటూ మిథున్ రెడ్డి అన్నారు..

# ఐపీఎస్ సంజయ్‌కు బెయిల్ మంజూరు

- ప్రభుత్వం నిధుల దుర్వినియోగం చేశారన్న అభియోగం కేసులో అరెస్టయిన ఐపీఎస్ సంజయ్‌కు బెయిల్ మంజూరు..!

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 15 :** అన్నమయ్య జిల్లా :-: ప్రభుత్వం నిధుల దుర్వినియోగం కేసులో జైల్లో ఉన్న ఐపీఎస్ అధికారి సంజయ్ కి ఎట్టకేలకు ఊరట లభించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న టైంలో అగ్ని - ఎన్వోసీ వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి కాంట్రాక్ట్ లో అవకతవకలు, పని పూర్తి కాక ముందే 59 లక్షల రూపాయలకు పైగా చెల్లింపులు చేశారని ఆయనపై ఆరోపణలున్నాయి. ప్రస్తుతం రిమాండ్ ఖైదీగా జైల్లో ఉన్నారు. కేసు నమోదైనప్పటి నుంచి బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నాళ్లకు ఆయనకు ఊరట లభించింది. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం కేసులో 112 రోజుల క్రితం సంజయ్ కుమార్ ను పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి బెయిల్ కోసం వివిధ కోర్టుల్లో పిటిషన్లు వేశారు. చివరకు బెయిల్ రావడంతో ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. నిడిగట్టు సంజయ్ 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. వైసీపీ హయాంలో ఏపీ సీఐడీ అదనపు డీజీగా పని చేశారు. అగ్నిమాపక శాఖ డిజీగా పని చేశారు. ఈ సమయం లోనే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. అందుకే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ని సస్పెండ్ చేసింది. తర్వాత అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకుంది. 2023 సెప్టెంబర్ లో అప్పటి ప్రతి పక్ష నేత చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయడంతో వార్తల్లో నిలిచారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో సీఐడీ చీఫ్ గా ఆయన వ్యవహరించిన తీరు విమర్శల పాలైంది. తర్వాత మార్గదర్శి కేసులో కూడా వ్యవహరించిన తీరు సరిగా లేదనే విషయంపై ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో వీటికి సమాధానం చెప్పే క్రమంలో ప్రెస్ మీట్ పెట్టిన సంజయ్ కాస్త అతిగా మాట్లాడారని ఆరోపణలు ఉన్నాయి. ఇలా కేసుల్లో వ్యవహరించిన తీరు, తర్వాత మీడియా సమావేశాల్లో చెప్పిన సమాధానాలతో వివాదాల్లో ఇరుక్కున్నారు. 2024 జూన్లో టీడీపీ అధికారంలోకి వచ్చాక సంజయ్ ని వెయిటింగ్ ఫర్ పోస్టింగ్ లో పెట్టారు. 2024 డిసెంబర్ లో విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశారు. అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్నప్పుడు వెబ్ పోర్టల్, మొబైల్ యాప్ అభివృద్ధి కాంట్రాక్ట్ లో అవకతవకలు, పనిపూర్తి కాకముందే 59 లక్షలకుపైగా నిధులు చెల్లింపులు చేశారు. సీఐడీలో ఎస్సీ, ఎస్టీ



అవగాహన కార్యక్రమాకు షార్ట్ టెండర్లు, 1.15కోట్లు దుర్వినియోగం చేశారు. 2025లో ఏసీబీ కేసు నమోదు, రిమాండ్, కస్టడీ పొడిగింపులు జరిగాయి. 2025 నవంబర్లో సస్పెన్షన్ మరో ఆరు నెలలు పొడిగించారు. అంటే మే 2026 వరకు ఆయనపై వేసిన సస్పెన్షన్ కంటిన్యూ అవుతుంది..

# మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల పటిష్ట బందోబస్తు

### జిల్లా ఎస్పీ నితిక పంత్

**నేటి సాక్షి కొమరం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి డిసెంబర్ 15 :** సోమవారం సాయంత్రం 5 గంటల నుండి పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి.ఎన్.ఎస్.ఎస్ అమలు ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు జిల్లాలో మొదటి, రెండవ విడత స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా మరియు నిష్పక్షపాతంగా నిర్వహించడంలో జిల్లా పోలీస్, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పాత్ర కీలకమైందని జిల్లా ఎస్పీ నితిక పంత్ తెలిపారు. మూడవ విడత ఎన్నికలలో భాగంగా ఈ నెల 17 న ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాని, కాగజ్ నగర్ మండలాల పరిధిలో 108 సర్పంచ్ స్థానాలు, 938 వార్డు మెంబర్ స్థానాలకు నిర్వహించే ఎన్నికలకు పోలీస్ బందోబస్త్ సంసిద్ధమని జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. సైలెంట్ పీరియడ్ అమలు పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి, అనగా సోమవారం సాయంత్రం 5:00 గంటల నుంచి బుధవారం వరకు, సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ సమయంలో



ఎన్నికల సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్ వినియోగం, ర్యాలీలు, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం అని అన్నారు. ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పహార, నిఘా బృందాలు, ఏరియా డామినేషన్ పార్టీలు, రూట్ మొబైల్, స్ట్రైకింగ్ ఫోర్స్ తో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండో విడత ఎన్నికల కోసం 611 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, 184 మంది ఇతర శాఖల సిబ్బంది( ఫారెస్ట్, సింగరేణి, ఎక్సైజ్, ట్రాన్స్‌కో, ఎ.సి.బి శాఖలు ) మొత్తం 795 మందిని నియమించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికలు పూర్తయ్య వరకు జిల్లాలో 163 బి.ఎన్.ఎస్.ఎస్ (144 సెక్షన్ ) అమల్లో ఉంటుందని, ఎన్నికల కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా ఆ పైగా వ్యకులు గుంపులు గుమికూడరాదు. అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు అక్కడ సమూహాలుగా ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలింగ్‌కు 48 గంటల ముందు నుండి ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. ఎన్నికల ఫలితాలు అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు, బైక్ ర్యాలీలకు, అనుమతి లేదని, మూడో విడత ఎన్నికలు పూర్తయిన అనంతరం సంబంధిత అధికారులు నిర్దేశించిన తేదీలలో మాత్రమే విజయోత్సవ సంబరాలు నిర్వహించుకోవచ్చు అని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ నితికా పంత్ కోరారు.

# రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం

- గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ప్రజావైద్యం కోసం విశేషంగా పనిచేసిన ఏకైక శ్రామికుడు వైయస్ జగన్..

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా, శర్మ, డిసెంబర్ 15 :** అన్నమయ్య జిల్లా :-: గత వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో ప్రజావైద్యం కోసం విశేషంగా పనిచేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి, పార్టీ నేత అంబటి రాంబాబు చెప్పుకొచ్చారు. అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా భర్తీ చేసిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. మరి నేటి కూటమి ప్రభుత్వం అదే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జనం ఆగ్రహంతో ఉన్నారనే దానికి సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ర్యాలీలే ఉదాహరణ అని మాజీ మంత్రి, అంబటి రాంబాబు స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వానికి ఒక హెచ్చరికలాంటిదన్నారు. ప్రజల పక్షాన వైయస్ఆర్‌సీపీ ప్రజా ఉద్యమం చేస్తుందని, గత 18 నెలల కాలంగా వైయస్ఆర్‌సీపీ అనేక ప్రజా ఉద్యమాలను చేసిందని ఆయన గుర్తు చేశారు. సోమవారం తాడేపల్లిలోని వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు, రైతాంగ సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నామని ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కమీషన్ల కోసమే పీపీపీ మోడల్‌లోకి తీసకెళ్లారని అంబటి రాంబాబు ఆరోపించారు. ఇది దుర్మార్గమైన చర్యగా అభివర్ణిస్తూ కూటమి ప్రభుత్వం మోడల్ కాలేజీలను అమ్మేసే ప్రయత్నం చేస్తున్నదని అంబటి రాంబాబు అన్నారు. నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు అక్కడ నుంచి కేంద్ర కార్యాలయం వరకు ప్రజల సంతకాలు వచ్చాయని ప్రతి జిల్లాలో వైయస్ఆర్‌సీపీ నిరసనలకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం హర్షించదగ్గ విషయమని జగన్ ప్రజావైద్యం కోసం విశేషంగా పని చేశారని అన్నీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా భర్తీ చేశారని కానీ కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక జీరో వెకెన్సీ సిస్టమ్ లేదని మందులు లేవని జగన్ తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న అసమర్థత నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 18న గవర్నర్ ను జగన్ కలుస్తారని ప్రజాభిప్రాయాన్ని గవర్నర్ కి తెలియజేస్తామని



ప్రైవేట్ వాళ్లకు కాలేజీలను అప్పగించి, సిబ్బందికి మాత్రం ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందట. ఇది నమ్మేదానికి మేము ఏమైనా వెర్రోళ్ళమా అంటూ అంబటి ఫైర్ అయ్యారు. దీని వెనుక పెద్ద స్కాం దాగుందని పేదవారి వైద్యాన్ని తాకట్టు పెట్టి కిక్ బ్యాగ్స్ తీసుకోవాలని చూస్తున్నారని కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకునే వరకు మా పోరాటం ఆగదని అంబటి రాంబాబు పేర్కొన్నారు..

# కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

### 150 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్లను అందజేత



**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (అద్దంకి) :** విద్యార్థులు కష్టపడి చదివితేనే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. SRR ప్రాజెక్ట్స్, అసిస్ట్ సంస్థ సహకారంతో రావినూతల ఉన్నత పాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయాలకు అతీతంగా విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. గతంలో ఒక్కో టీచర్ రెండు, మూడు సబ్జెక్ట్ లను బోధించేవారన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఒకేసారి 16,300 ఉపాధ్యాయులను డిఎస్సీ ద్వారా నియమించామని చెప్పారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం మరింత పెరిగే విధంగా బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనంతో పాటు సమయానికి యూనిఫార్మ్, బుక్స్, బ్యాగులను కూడా అందించామని మంత్రి గుర్తు చేశారు. అదే విధంగా రావినూతల, చందలూరు ప్రాంతాల్లో వచ్చే ఏడాదికి జూనియర్ కాలేజ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.


# తంగడపల్లి సర్పంచ్‌గా పామెన రాములు ఘన విజయం



**నేటి సాక్షి ప్రతినిధి చేవెళ్ల న్యూస్ :** చేవెళ్ల మండలం తంగడపల్లి గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పామెన రాములు ఘన విజయం సాధించారు. ఉత్కంఠభరితంగా సాగిన పోటీ అనంతరం ఆయన 204 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థులపై స్పష్టమైన ఆధిక్యం సాధించి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు.ఎన్నికల ప్రచార కాలంలో గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, అందరికీ సమాన న్యాయం అనే అంశాలను ప్రధానంగా ముందుకు తీసుకెళ్లిన పామెన రాములు, గ్రామ ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను వినిపించుకున్నారు. ఆయన సరళమైన స్వభావం, అందుబాటులో ఉండే నాయకత్వం ప్రజల్లో విశేష ఆదరణ పొందిందని గ్రామస్థులు తెలిపారు. ఫలితాలు వెలువడిన వెంటనే గ్రామంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. మద్దతుదారులు బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు. విజయం అనంతరం పామెన రాములు మాట్లాడుతూ, "ఈ విజయం నాది కాదు, తంగడపల్లి గ్రామ ప్రజల విజయం. మీరు పెట్టిన నమ్మకాన్ని వృథా చేయకుండా గ్రామ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తాను" అని అన్నారు.విజయం సాధించిన సందర్భంగా పామెన రాములు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య పామెన రాములును అభినందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. తమ పూర్తి సహకారం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పేదల సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేసిన పామెన రాములు, ప్రజల సహకారంతో తంగడపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేశారు.

# 103 ఓట్ల మెజార్టీతో గెలిచిన మాసానిగూడ సర్పంచ్

### బద్రి అర్చన ప్రభు గౌడ్



**నేటి సాక్షి :శంకర్‌పల్లి: డిసెంబర్ 15:** శంకర్‌పల్లి మండల పరిధిలోని మాసానిగూడ సర్పంచ్ 103 ఓట్ల మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బద్రి అర్చన ప్రభు గౌడ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించి గెలిచారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ అర్చన మాట్లాడుతూ గ్రామ ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. నన్ను గెలిపించిన గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గెలిచిన అభ్యర్థిని గ్రామస్తులు అభినందించి, సంబరాలు చేసుకున్నారు.